
ఆంధ్రజ్యోతి



గుంటూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 28 జనవరి 2025

సచివాలయాల్లో.. సమూల మార్పు



● ఏఐ, డ్రోన్ టెక్నాలజీని గ్రామాలకు చేర్చే దిశగా అడుగులు

8

ఆంధ్రజ్యోతి అక్షర వారధి



అక్షర ఆయుధ సమరంలో తనదైన ముద్ర వేసుకున్న ఆంధ్ర జ్యోతి ప్రజా సమస్యల పరిష్కారానికి అక్షర వారధిని నిర్మిస్తోంది. ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్క రించేందుకు ప్రజలు, అధికార యంత్రాంగానికి మధ్య వారధిలా నిలవ బోతోంది. తొలిగా గుంటూరు ఎస్వీఎన్ కాలనీపై ఫోకస్ చేసిన ఆంధ్రజ్యోతి కలం.. కాలనీని వెంటాడుతున్న సమస్యలను వెలుగులోకి తెచ్చింది. చరిత్ర పుటల్లో దాగిన కాలనీ విశేషాలను ప్రజల ముందు ఆవిష్కరిస్తోంది. ఈనెల 30న ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీ ప్రజలను ఒక వేదిక మీదకు తెచ్చి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తోంది.

శివారుకు.. సంచార రైతుబజార్లు

● నిత్యం సాయంత్రం వేళ వెలగపూడి సచివాలయానికి ఒక వాహనం ● మరో రెండు గుంటూరు నగర శివారు ప్రాంతాల్లో చక్కర్లు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మ్ టూ హోం (పొలం నుంచి ఇంటికి) అనే ఉద్దేశంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచార రైతుబజార్లను తీసుకొచ్చింది. రైతు తాను పండించిన కూరగాయలు, ఆకుకూరలను నేరుగా వినియోగదారుడికే విక్రయించేందుకు ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం జిల్లాకు నాలుగు సంచార రైతుబజార్లను కేటాయించింది. అయితే వాటిల్లో ఒకటి మరమ్మతులకు గురి కావడంతో ప్రస్తుతం మూడు సంచార రైతుబజార్లు వినియోగదారుల చెంతకు కూరగాయలు తీసుకెళుతున్నాయి. నిత్యం ఒక వాహనం సాయంత్రం వేళ అమరావతి రాజధానిలోని వెలగపూడిలో ఉన్న సచివాలయానికి వెళుతున్నది. అక్కడ విధులు నిర్వహించుకొని ఇంటికి వెళ్లే ఉద్యోగస్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి. అలానే మరో రెండు సంచార రైతుబజార్లు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని శివారు ప్రాంతాలకు కూరగాయలు తీసుకెళ్లి ప్రజల ముంగిట ఉంచుతున్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే రైతుబజార్ల ఏర్పాటు ప్రారంభమైంది. అంతకుముందు వరకు ప్రైవేటు కూరగాయల మార్కెట్లను ప్రజలు ఆశ్రయించాల్సి వచ్చేది. వాటిల్లో అధిక ధరల వలన ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఎప్పుడైతే రైతుబజార్లు వచ్చాయో అన్నివర్గాల ప్రజల ఆదరణని ఇవి పొందుతున్నాయి. కరోన లాంటి కష్టకాలంలోనూ ప్రజలకు సమృద్ధిగా రైతుబజార్లే కూరగాయలు పంపిణీ చేశాయి. కాగా జిల్లాలోని గుంటూరు



మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన సంచార రైతుబజార్లు

నగరం, మంగళగిరి, తెనాలి, పొన్నూరు లాంటి పట్టణాల్లోనే ఈ రైతుబజార్లు ఉన్నాయి. అవి కూడా పరిమిత సంఖ్యలో ఉన్నాయి. దీంతో శివారు ప్రాంతాల ప్రజలు కూరగాయల కోసం రైతుబజార్లకు రావడానికి రెండు, మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తున్నది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న మార్కెటింగ్ శాఖ సంచార రైతుబజార్లను తీసుకొచ్చింది.

నిత్యం ఏదో ఒక శివారు కాలనీకి ఈ సంచార రైతుబజార్లు తాజా కూరగాయలను తీసుకొని వెళుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను బోర్డులపై ప్రదర్శించి విక్రయిస్తున్నాయి. ఉల్లిపాయలు, టమాటాలు, ఆకు కూరలు, క్యాలీఫ్లవర్, వంకాయ, దుంపలు, క్యారెట్, బీట్రూట్, దోసకాయలు, బీర, కీర, బెండ, దొండ, చిక్కుడు వంటి అన్ని రకాల కూరగాయలను తీసుకొస్తుండటంతో ఆయా కాలనీల ప్రజలు వ్యయప్రయాసల కోర్చి రైతుబజార్ల వద్దకు రావాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడిప్పుడే వీటికి ఆదరణ పెరుగుతున్నదని, త్వరలోనే మరికొన్ని పట్టణాల్లోనూ సంచార రైతుబజార్ల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు.. 17 నామినేషన్లు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి)): గుంటూరు నగర పాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు 17 నామినేషన్లు దాఖలైనట్లు, స్టాండింగ్ కమిటి ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు సోమవారం తెలిపారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వాటిని అభ్యర్థుల సమక్షంలో స్క్రూట్నీ చేశామన్నారు. ఈ నెల 27వ తేదీ నుండి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, అదే రోజు 3 గంటల తర్వాత పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

రిసార్ట్ మోసాలపై పోలీసుల గురి





(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకని రెండు వారాల వ్యవధిలో 8 మంది సైబర్ మోసాల బాధితులుగా మిగిలారు. వీరంతా తెలంగాణవారే కాగా, వారాంతంలో ఆహ్లాదంగా బీచ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సేద తీరాలనుకున్న వారు సైబర్ దొంగలు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిలలాడారు. బాధితులుగా బయటికొచ్చిన వారు 8 మంది కనబడుతుండగా, పదుల సంఖ్యలో ఈ మోసాల బారిన పడి బయటికి చెప్పనివారు ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు ఐదు నెలల క్రితం ఇదే తరహాలో సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట సైబర్ దొంగలు మోసాలకు పాల్పడ్డారు. అప్పుడు రిసార్టు నిర్వాహకులు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ దశలోనే ఆ కేసు నీరుగారిపోయింది. తర్వాత కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్న సైబర్ నేరగాళ్లు మళ్లీ జనవరి నుంచి పర్యాటకులే లక్ష్యంగా, అది కూడా సూర్యలంక హరిత బీచ్ రిసార్టుపైనే ఎక్కువగా గురిపెట్టి పెద్ద ఎత్తున మోసాలకు

(మిగతా 8వ పేజీలో)

◆ సూర్యలంక హరిత బీచ్ రీసార్ట్ పేరిట సైబర్ వల
◆ బాధితుల్లో ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే
◆ రెండు వారాల వ్యవధిలో 8 మంది ఉచ్చులో
◆ బయటపడని వారు మరెందరో
◆ నకిలీ వెబ్‌సైట్లపై డీజీపీకి లేఖ రాసిన ఏపీటీడీసీ
◆ సూర్యలంక రిసార్టు నుంచి వివరాలు తీసుకున్న డీజీపీ ఆఫీస్

బాధితుల వివరాలు.. వారు నగదు బదిలీ చేసిన ఖాతాలు..


హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఈ నెల 12న సూర్యలంక హరిత బీచ్ రిసార్టులో గదులు బుక్ చేసుకోగా రూ.7,535 చెల్లించగా అది నకిలీ వెబ్‌సైట్ అని తాను మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు బ్యాంకు ఖాతా వివరాలను కూడా సేకరించగా అది మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు తేలింది. ఈ వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు నిర్వాహకులకు బాధితుడు అందించారు. ఇదే నెల 14న మరో ముగ్గురు బాధితులు వెలుగులోకి వచ్చారు. వీరిలో ఇద్దరు హైదరాబాద్ వాసులు కాగా, మరొకరు ఖమ్మం వాసి. వీరు నకిలీ వెబ్‌సైట్‌లో గదులుబుక్ చేసుకుని కుటుంబంతో కలిసి నేరుగా హరిత బీచ్ రిసార్టుకు రాగా మేనేజర్ అలాంటి బుకింగ్‌లేవీ జరగలేదని సమాధానమివ్వడంతో కంగుతినడం వారి వంతయింది. రూ.15,000 వరకు వీరు మోసపోయారు. వీరంతా కూడా బ్యాంకు ఖాతా వివరాలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఫోన్ నంబరు తదితరాలతో సమగ్రంగా రిసార్టు నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ఏపీటీడీసీకి అందించగా, వాటిని డీజీపీ కార్యాలయంలో అందజేశారు. వాటి ఆధారంగానే విచారణ మొదలుపెట్టిన పోలీసులు తొలుల బ్యాంకు ఖాతా వివరాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. బాధితులు నగదు బదిలీ చేసిన ఖాతాలను బ్లాక్ చేయించే ప్రక్రియ నిబంధనల ప్రకారం ఇప్పటికే మొదలయింది. మరో వారం రోజుల్లో సైబర్ దొంగల ఆట కట్టిస్తామనే ధీమాను పోలీస్ శాఖ వ్యక్తం చేస్తోంది.



హరిత బీచ్ రిసార్టును పోలే విధంగా గదుల చిత్రం డిస్‌ప్లేలో ఫోన్ నంబర్

రూటు మార్చిన ఏపీటీడీసీ

సైబర్ మోసాల బాధితులు ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు ఇవ్వడానికి వెనకాడడం కూడా ఇన్ని రోజులూ సైబర్ దొంగలకు కలిసి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులుగా వచ్చేవారు తాము మోసపోయినట్లు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడానికి అంగీకారం తెలిపేవారు కాదు. మళ్లీ ఇటీవల వరుసగా సూర్యలంక హరిత బీచ రిసార్టు పేరిట సైబర్ మోసాలు వెలుగుచూడడంతో ఏపీటీడీసీ దృష్టి సారించింది. ప్రభుత్వ సంస్థ పేరుతోనే డీజీపీకి నేరుగా ఫిర్యాదు చేయడంతో సైబర్ దొంగల మూలాలను కూపీలాగే పనిలో పోలీస్ శాఖ ఉంది.




సకల జనుల వేదికగా మహోత్సవాలు

బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్



● మహోత్సవాలకు హాజరైన భక్తులు

6



● ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

● అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 15 నుంచి 25 శాతం పెంపు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఒకటో తేదీ నుంచి నూతన చార్జీలు అమలులోకి వస్తాయి. భూముల మార్కెట్ విలువలపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో (మిగతా 8వ పేజీలో)



ఈవో సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్‌కు.. రంగం సిద్ధం

8

● చేయని ఖర్చులు చేసినట్టు చూపి రూ. రెండు కోట్లకు పైగా స్వాహా...
● కమిషనర్‌కు సమగ్ర నివేదిక అందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

బీసీల బంధువు టీడీపీ

● రాజకీయ, సామాజిక హోదా ఇచ్చింది
● బీసీల్లో ఆర్థిక విప్లవం కోసం మరింత కృషి ● జగన్ పాలనలో బీసీలందరికీ అవమానాలే... ● బీసీలకు పవర్ లేని పదవులతో అణగదొక్కిన వైసీపీ పాలన
● టీడీపీ బీసీ సభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బలహీన వర్గాలైన బీసీ జన బంధువు టీడీపీ అని, బీసీల రాజకీయ, సామాజిక అభివృద్ధి టీడీపీ ఆవిర్భావంతోనే మొదలైందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుల నేతృత్వంలో గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో టీడీపీలోని బీసీ మంత్రులకు అభినందన సత్కార సభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 1982లో టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగిందన్నారు. పంచాయతీ కార్యాలయాలకు వెళ్లాలంటేనే భయపడే బీసీలకు పార్లమెంటు మెట్లు ఎక్కే వరకు టీడీపీ అభివృద్ధి బాటలు వేసిందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక హోదాతో పాటు ఆర్థిక పరిపుష్టత కూడా పొంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఇక్కడ జిల్లాల నుంచి ఢిల్లీ వరకు బీసీలకు అన్నీ అవమానాలేనని అన్నారు. పార్లమెంటులో తననే అవమానించేలా వైసీపీ ఎంపీలు వ్యవహరించారని గుర్తుచేశారు. నా బీసీలంటూ పవర్ లేని పదవులు ఇచ్చి అవమానించాడన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు పదవులు ఇచ్చినా వారందరూ జగన్, ఆయన పరివారం వద్ద తలవంచి, వారి ముంగిట కూర్చోవాల్సిందేనన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో ఓటు బ్యాంకుగా ఉన్న బీసీలకు దివంగత ఎన్‌టీఆర్ టీడీపీని స్థాపించి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన టీడీపీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఉచిత కోచింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో కూడా డీఎస్సీ కోచింగ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీల, ఎస్సీల ద్రోహి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రంలో 8 మంది మంత్రులు, 38 మంది ఎమ్మెల్యేలు, సీఎస్, డీజీపీ, టీటీడీ ఈవో ఎక్కడ చూసినా బీసీలే కనిపిస్తున్నారంటే ఇది బీసీ ప్రభుత్వం కాదా అని స్పష్టం చేశారు.

గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రూ. 3 లక్షలు నుంచి రూ. 3.5 లక్షలు ఇస్తే నా ఎస్సీ, నా బీసీ అనే జగన్ కేంద్ర ప్రభుత్వం రూ. లక్షన్నర ఇస్తే జగన్ కేవలం రూ. 30వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రావాల్సిన రూ. 74వేల కోట్లను దారి మళ్ళించి తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. అలానే మాజీ సీఎం జగన్ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లను 33 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ఎంతో మంది బీసీల నాయకత్వానికి గండికొట్టాడని ధ్వజమెత్తారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన బీసీ బిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీ స్థాయికి వెళ్లారంటే అది (మిగతా 6వ పేజీలో)




మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, సవిత, ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్

నేడు డీఆర్‌సీ మీటింగ్

● మూడొంతెనల మార్గం..
● గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ మీద చర్చకు అవకాశం

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష మండలి సమావేశం మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. సమావేశంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్, గుంటూరు నగరపాలకసంస్థ, ఎంటీఎంసీ, హౌసింగ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మెడికల్ అండ్ హెల్త్, స్త్రీ, శిశు సంక్షేమం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో తొలుత గత మీటింగ్‌లో చేసిన తీర్మానాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టుపై చర్చ జరుగుతుంది. ఈ సమీక్షకు జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర సభ్యులు హాజరౌతారని తెలిపారు.



కాగా సమావేశంలో ప్రధానంగా గుంటూరు నగరపాలకసంస్థకు సంబంధించిన అంశాలపై ప్రస్తావించాలని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. రెండు నెలల క్రితం డొంక రోడ్డు మూడొంతెనల మార్గాన్ని నూతన రైల్వేట్రాక్ నిర్మాణం కోసం మూసివేశారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ట్రాఫిక్‌ని పునరుద్ధరిస్తామని చెప్పారు. తీరా గడువు ముగిసినా నగర పాలకసంస్థ పైపులైను పనులు పూర్తి కాలేదు. ఇప్పుడు హడావిడిగా పైపు లైను పనులు చేస్తున్నారు. ఇవి పూర్తి అయి రైలు వంతెన నిర్మాణానికి కనీసం మరో నెల వ్యవధి పట్టే అవకాశం ఉన్నది. పనుల జాప్యం వలన నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. దీనిపై సమావేశంలో చర్చించాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. అలానే గోరంట్ల వాటర్‌స్కీమ్‌ని పూర్తి చేస్తామని చెప్పి పదేపదే వాయిదా వేస్తున్నది. దీని పైనా అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించనున్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనుల పురోగతిపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించే అవకాశం ఉన్నది. గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్స్ విషయంలో నగరపాలకసంస్థ అవలంబిస్తున్న నిర్లిప్త వైఖరిని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నిలదీసే అవకాశం ఉన్నది.

బీఈడీ పరీక్షల ఫీజు తేదీలు మార్పు

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ఫీజు చెల్లించుకునే గడువును మార్పు చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. మార్పు చేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీలోగా సంబంధిత అభ్యర్థులు ఫీజు చెల్లించుకోవచ్చునని సూచించారు. రూ. 100 అపరాధంతో ఫిబ్రవరి 6వ తేదీలోగా చెల్లించవచ్చునని తెలిపారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ ను సంప్రదించాలని సీఈ సూచించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం పేరుతో రూ.5 లక్షలు వసూలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో హోం మంత్రి తానేటి వనిత సోదరుడు విజయ్ మోహన్ కుమార్ తనకు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 5 లక్షలు తీసుకొని మోసగించారని గుంటూరులోని బ్రాడీపేటకు చెందిన చెలపాక రాజ్యలక్ష్మి సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022లో కానిస్టేబుల్ నోటిఫికేషన్ వెలువడిన సమయంలో తనకు తెలిసిన వారి ద్వారా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సత్యవతినగర్‌లో ఉంటున్న జొన్నకుర్తి విజయ్ మోహన్ కుమార్‌ను సంప్రదించానన్నారు. తన చెల్లెలు తానేటి వనిత హోం మంత్రిగా ఉందని, తప్పక కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడన్నారు. ఇందుకుగానూ 2022 డిసెంబరు 8న తన వద్ద నుంచి రూ. 5 లక్షలు తీసుకున్నాడని వివరించారు. ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బు ఇవ్వాలని అనేక సార్లు తిరిగానన్నారు. డబ్బులు కోసం విజయమోహన్ కుమార్‌ను సంప్రదిస్తే తాను ఆ డబ్బు తన సిస్టర్‌కు ఇచ్చానని, హోం మంత్రిని కలవాలని చెప్పాడని అన్నారు. హోం మంత్రి తానేటి వనితను కలిస్తే తన సోదరుడిని కలవాలని చెప్పారన్నారు. ఈ విధంగా ఒకరిపై, ఒకరు చెప్పుకున్నారని, దీంతో అప్పటి పట్టాభిపురం సీఐ విజయ్ చంద్రకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనికి సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, న్యాయం చేయాలనీ, తనను మోసం చేసి తీసుకున్న డబ్బును ఇప్పించాలని బాధితురాలు పోలీసు అధికారులను వేడుకున్నారు.

సకల జనుల వేదికగా మహోత్సవాలు

- బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సకల జనులకు వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిలిచాయని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రధానంగా మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ ఇచ్చిన దైవ సందేశం భక్తులలో విశ్వాసాన్ని నింపింది. ఈ సందర్భంగా యేసు క్రీస్తు చేసిన అద్భుతాలను వివరించారు. ఆనాటి యెరికో పట్టణంలో అంధత్వం కలిగిన వ్యక్తి తనకు చూపు ప్రసాదించమని విశ్వాసంతో ప్రార్థించగా, అతని జీవితంలో ఏసుక్రీస్తు ప్రభువు అద్భుత కార్యాలు చేసినట్లు వివరించారు. తొలుత తూర్పుగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ డి.సుధాకర్, కె.ఏసురత్నం, ఎన్. సత్యంబాబు, మహిమాకర్షణ కుమార్, సీహెచ్ షాలేము శరత్ తదితరులు దైవ సందేశాలు అందించారు. మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.సజీవరావు, ఫాదర్ ఎం.దేవదాసు, గవర్నింగ్ బాడీ సభ్యుల సారధ్యంలో వివిధ కమిటీల కృషితో ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి.


మహోత్సవాలకు హాజరైన భక్తులు

హాజరైన ప్రముఖులు

బైబిల్ మిషన్ మహోత్సవాలకు సోమవారం వేమూరు ఎమ్మెల్యే ఆనంద్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు (మ్యాని) తదితరులు హాజరయ్యారు.

నేటి షెడ్యూల్ ఇలా..

బైబిల్ మిషన్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ధ్యానం, కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనల ఆలాపన, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, జాయింట్ సెక్రటరీ జె.ఆగమనరావు, సాయంత్రం జె.వినోద్ కుమార్, పాస్టర్లు జి.శామ్యూల్, వి.సతీష్ బాబు తదితరులు దైవ సందేశాలు అందిస్తారు.

'పరిష్కారమే ఎజెండా'తో మనోహర్ పాదయాత్ర

- 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' స్ఫూర్తితో ఒకే రోజు ప్రారంభం
- ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటూ..
- అధికారుల అక్రమాలపై సీరియస్

తెనాలి, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగారు... జనం సమస్యలు తెలుసుకున్నారు. అదే సమయంలో ఆయా వార్డుల్లో ఏళ్లతరబడి పరిష్కారం కాని సమస్యలపైనా దృష్టి పెట్టారు. సాధ్యమైన వాటికి అప్పటికప్పుడు పరిష్కారం చూపగా, దీర్ఘకాల సమస్యలకు ఒక నిర్దిష్ట సమయాన్ని కూడా అప్పుడే కేటాయించారు. ఇదంతా 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం స్ఫూర్తితో అదే రోజు మొదలు పెట్టడం సంతోషంగా ఉందంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి పట్టణంలోని వార్డుల్లో సోమవారం పర్యటించారు. మొదట ఐతానగర్‌లోని పేరంటాళ్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. తర్వాత 1, 2 వార్డుల్లో పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మాతోపాటు 'ఆంధ్రజ్యోతి' కూడా ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. ఎప్పుడో మొదలు పెడదామనుకున్న కార్యక్రమం రాష్ట్రంలోని పరిస్థితుల దృష్ట్యా వాయిదా పడుతూ వచ్చిందనీ, అయితే 'ఆంధ్రజ్యోతి' రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం వినూత్న కార్యక్రమం చేపట్టిన రోజునే మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు మీడియా కూడా తోడుంటే మరింత సమర్థంగా పరిష్కారం చూపగలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పత్రికలతో కలిసి నడవటానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ జనం వ్యక్తిగత సమస్యలతోపాటు, కాలనీల సమస్యలపైనా దృష్టిపెట్టారు. ఎక్కువగా ఇళ్లు, రేషన్ కార్డుల వంటి వ్యక్తిగత అంశాలు ఆయన ముందుకు వస్తే, ఎక్కువ మంది టిడ్కో ఇళ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాల సమస్యలపై ఏకరవు పెట్టారు. ఆయనతోపాటు పర్యటనలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఇతర జనసేన, టీడీపీ నాయకులు, ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తర్వాత విలేకరులతో మంత్రి మనోహర్ మాట్లాడారు. తెనాలి పట్టణాన్ని ఒక మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం వంటివాటిలో స్కామ్ జరిగిందనీ, తెనాలిలో భారీ స్కామే జరిగిందని, రూ. వందల కోట్లు వెచ్చించి భూముల కొనుగోలుకు చూపిన శ్రద్ధ, కనీస వసతులు కల్పించటంలో చూపలేదన్నారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. ఇకపై నియోజకవర్గం మొత్తం పర్యటించి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ఒక ప్రణాళిక రూపొందించుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.


ఐతానగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్, పక్కన రాజకుమారి



డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం

- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

తాడేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకూడదని, వారికి దూరంగా ఉండాలని డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి భవిష్యత్తు అంధకారమేనని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. సోమవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఈగల్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో వారిని కూడా ఈగల్ శాఖలో భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు నియంత్రించడం ముఖ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్యాలు లేకుండా తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యార్థి ఈగల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలబారిన పడితే టోల్ నెం.1972కు తెలిపితే బాధితులకు కౌన్సిలింగ్ ఇచ్చి కాపాడతామన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు అయితే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. గంజాయి కేసులో అరెస్టు అయినవారు నేరస్తులుగా జీవితకాలం పాటు గుర్తింపు కలిగి ఉంటారన్నారు. ఈగల్ ఎస్పీ నగేష్, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్‌లు డాక్టర్ కేఆర్ ఎస్ ప్రసాద్, హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని విద్యార్థులు పాల్గొన్నారు.


కేఎల్‌యూలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ నగేష్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పాదయాత్రతో చరిత్రను సృష్టించిన నారా లోకేష్

గుంటూరు(తూర్పు), జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు నవభారత్ నగర్‌లో క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రతో లోకేష్ పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చారన్నారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంతో రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేయగలుగుతారనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చి యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టేందుకు లోకేష్ కృషి చేస్తున్నాడని అన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం కావడమే కాకుండా ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా దావోస్‌లో పర్యటించారని అన్నారు. దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని చెప్పి కంపెనీలను ఏర్పాటు చేసేలా ఆహ్వానించారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులుతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న భాష్యం ప్రవీణ్, పాల్గొన్న కూటమి నాయకులు

బంగారం చైన్లతో పరార్

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 44 గ్రాముల బంగారు చైన్లతో పరార్‌పై బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. లాలాపేటలోని క్లాత్ బజార్లో రెండేళ్లుగా రామ్ రాజేంద్ర జువెలరీ షాప్ నిర్వహిస్తున్నారు. అదే షాపు ఎదురుగా గణేష్ జువెలర్స్ షాపు ఉంటుంది. అందులో అక్బర్ అనే యువకుడు పని చేస్తుంటాడు. గతంలో అనేకసార్లు అవసరమైన బంగారు ఆభరణాలు తీసుకువెళ్లి తీసుకొస్తుంటాడు. అలాగే గత ఏడాది అక్టోబర్ 8న షాప్‌కి వచ్చి 44 గ్రాముల రెండు బంగారు గొలుసులను తీసుకెళ్లాడు. సాయంత్రం అయినా బంగారం గాని, డబ్బులు గానీ ఇవ్వకపోవడంతో గణేష్ జ్యువెలర్స్ యజమాని లక్ష్మణ్‌కు ఫోన్ చేయగా తాను ఆసుపత్రిలో ఉన్నారని చెప్పి ఫోన్ పెట్టేశాడు.ఆ తర్వాత మళ్లీ ఆయనకు ఫోన్ చేసి అడగ్గా అక్బర్ తమ షాపులో ఎప్పుడో మానేశాడు అని చెప్పాడు అన్నారు. ఎదురు షాపు వాళ్లు తీసుకురమ్మన్నారని మాయమాటలు చెప్పి నమ్మకంగా బంగారపు గొలుసులతో ఉడాయించిన అక్బర్ పై చట్టప్రకారం చర్యలు తీసుకొని, తమ వద్ద కాజేసిన 44 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేయాల్సిందిగా బాధితుడు కోరారు.

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని చంపి రైలు పట్టాలపై పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని పాత గుంటూరులోని అంబేద్కర్ నగర్ మూడో లైన్ కి చెందిన వీసం అంజలి అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన భర్త సుబ్బారావు చనిపోయాడని అప్పటి నుంచి తాను, తన కుమారుడు కల్యాణ్, తన అత్త కలిసి ఉంటున్నామన్నారు. కుమారుడు కల్యాణ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదివి మానేశాడు అన్నారు ఆ తర్వాత ఆయన స్నేహితుడైన యోహానుతో కలిసి భాగస్వామ్యంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టారన్నారు. ఈ హోటల్ పెట్టిన నెల రోజుల తర్వాత తమ కుమారుడు అదృశ్యమయ్యాడన్నారు. ఉదయాన్నే ఏమి తెలియనట్లు యోహాను వచ్చి కల్యాణ్ ఎక్కడికి వెళ్లాడని అడిగాడు అన్నారు. మీరిద్దరే కలిసి వెళ్లారు అనుకుంటున్నామని చెప్పగా తనకు తెలియదని చెప్పి వెళ్ళిపోయాడన్నారు. దీనిపై తమ పాతగుంటూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు.

'గ్రీన్ గ్రేస్' అక్రమాలను అరికట్టాలి

- డీఆర్‌ఎంకు నివేదించిన పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్ యాజమాన్యం తప్పుడు పద్ధతిలో భవన నిర్మాణ అనుమతులు, ఎన్‌వోసీలు పొందాలని ప్రయత్నిస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే నరేంద్ర పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వెళ్లి డీఆర్‌ఎం ఎం.రామకృష్ణతో సమావేశమై పలు అంశాలను ఆయనకు నివేదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ యాజమాన్యం అక్రమాలను గమనించి ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరిగినా వాటికి బాధ్యత రైల్వేదే అవుతుందని హెచ్చరించారు. గతంలో రైల్వే నుంచి ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో ఐదు ఫ్లోర్ల అపార్ట్‌మెంట్‌నకు అనుమతులు పొంది తదనంతరం ఎలాంటి అనుమతులు లేకుండా 15 అంతస్తుల నిర్మాణం చేసినట్లు వివరించారు. దీనిపై సరైన నిర్ణయం తీసుకోకపోతే అమాయకులైన ప్రజలు నష్టపోతారని తెలిపారు. గుంటూరు నగర మాస్టర్ ప్లాన్‌లో ఉన్నటువంటి 60 అడుగుల రోడ్డును రైల్వే, జీఎంసీ కలిసి అప్రూవ్ చేసినటువంటి ప్లాన్‌లో చూపించలేదని అన్నారు. రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ తాము ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, రైల్వే నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి ఎన్‌వోసీలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో గతంలో ఇచ్చిన ఎన్వోసీని రద్దు చేశామని తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నిసార్లు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసినప్పటికీ అనుమతులు ఇవ్వమని చెప్పారు. జీఎంసీ మాస్టర్ ప్లాన్‌లోని 60 అడుగుల రహదారి రైల్వే వారిది కాదని, అది జీఎంసీ పరిధిలోనిదే అని డీఆర్‌ఎం చెప్పారు. త్వరలోనే గుంటూరు నాలుగు లైన్లుగా పరిణితి చెందబోతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే జరిగే ప్రమాదాలకు ప్రజలు నష్టపోతారని, ప్రజలకు ప్రభుత్వానికి నష్టం చేకూర్చకుండా చూడడమే తమ బాధ్యతని తెలిపారు.


డీఆర్‌ఎంతో సమావేశమైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

బీసీల బంధువు టీడీపీ

(5వ పేజీ తరువాయి)

టీడీపీతోనే సాధ్యమైందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా తనకు పశ్చిమ టికెట్ ఇచ్చి బీసీ బిడ్డను అసెంబ్లీకి పంపిన ఘనత టీడీపీ,సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. విజనరీ నాయకత్వం కలిగిన చంద్రబాబు సారధ్యానికి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చరిత్రాత్మక నిర్ణయాలతో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెళుతుందన్నారు. అమరావతి రాజధాని పునర్ నిర్మాణంతో పాటు రైతుల బకాయిలు రూ. 2 వేల కోట్లు విడుదల చేయటం, బీసీ సబ్ ప్లాన్ వంటి అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.


పూలదండతో సన్మానం

అప్పుల బాధలు తాళలేక గృహిణి ఆత్మహత్య

గుంటూరు జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా రోడ్డులో గల లోకాస అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి చిట్టిరాల పుష్పావతి (45) అనే గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు.. దాచేపల్లికి చెందిన పుష్పావతి, విజయ్ కుమార్ దంపతులు ఆరు నెలల క్రితం గుంటూరు వచ్చి సాయిబాబా రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. గతంలో విజయకుమార్ కోడిగుడ్ల వ్యాపారం చేసేవాడు. అందులో నష్టం రావడంతో ఆరు నెలల క్రితం గుంటూరు వచ్చారు. ఆర్థిక సమస్యలతోపాటు మానసిక సమస్యతో బాధ పడుతున్న పుష్పావతి సోమవారం ఉదయం సుమారు 6 గంటలకు తాము ఉంటున్న నాలుగో ఫ్లోర్ నుంచి కిందకు దూకేసింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు ఈ మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య

పెదకాకాని, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెదకాకానిలో వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని గ్రామానికి చెందిన వేములకొండ హారిక(17) అనే విద్యార్థిని నారాకోడూరు శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. అమ్మమ్మ వాణి, తాతయ్య కొండలరావు వద్ద ఉంటూ కళాశాలకు వెళ్తుంది. ఆర్నెల్ల క్రితం తాతయ్య కొండలరావు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి హారిక మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో కళాశాలకు కూడా అప్పుడప్పుడు వెళ్లడం లేదు. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న రైలు బండి కింద పడి హారిక ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు మృతురాలు వేములకొండ హారికగా గుర్తించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125,134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

ప్రణాళికతో పక్కా ఇళ్లు..

ఎస్వీఎన్ కాలనీలో మొత్తం 216 ప్లాట్లు ఏర్పాటు చేశారు. వాటిని 4 కేటగిరీలుగా పంపిణీ చేశారు. కేటగిరీ- ఏ కింద 800 గజాలు, కేటగిరీ- బీ కింద 600 నుంచి 650 గజాలు, కేటగిరీ- సీ కింద 400 నుంచి 450 గజాలు, కేటగిరీ- డీ కింద 300 నుంచి 350 గజాల స్థలాలు కేటాయించారు. కాలనీ మెయిన్‌రోడ్డు 60 అడుగులు, అంతర్గత రోడ్లు 30 అడుగుల వెడల్పు ఉండేలా కాలనీ లే అవుట్‌ను రూపొందించారు. అప్పట్లో ఒక గజం విలువ రూ.400 ఉండేది. ఆ ప్రకారం ఎవరి ఆర్థిక స్తోమతను బట్టి వారు ఆయా కేటగిరీ ల్లో ప్లాట్లు తీసుకుని ఇళ్లు నిర్మించు కున్నారు. కాలనీ తొలినాళ్లలో ఇల్లు నిర్మించుకో వడానికి రూ.45వేలు ఖర్చయిందని పాత తరంవారు వారి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు.



● ఎస్వీఎన్ కాలనీ అభివృద్ధి పథంలో

ఎన్నో మలుపులు

తొలినాళ్లలో భయం.. భయం

గుంటూరుకు శివారు ప్రాంతం కావడంతో కాలనీ ఏర్పాటైన తొలినాళ్లలో ఎన్నో సమస్య లు ఎదురయ్యాయి. తాగునీటి సమస్య వారిని తీవ్రంగా వెంటాడింది. బావులు తవ్వు కుంటేనో, బోర్లు వేయించుకుంటే తప్ప తాగడానికి కూడా నీళ్లు దొరకని పరిస్థితి ఏర్ప డింది. కొన్నాళ్లు స్తంబాలగరువు రిజర్వాయర్ ద్వారా కార్పొరేషన్ నీళ్లు సరఫరా చేసింది. ఇప్పుడు పైపులైను వేసినా ఆ సమస్య వెంటాడుతూనే ఉంది. శివారు ప్రాంతం కావడంతో దొంగల బెడద కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. నిత్యం దొంగతనాలు జరుగుతుండేవి. వాటిని ఎదుర్కోవడానికి కాలనీ కమిటీ పటిష్ట చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. కాలనీ వాసులందరూ ఒక తాటి మీదకు వచ్చి కాపలా కాసి దొంగల బెడదను అరికట్టుకున్నారు. వాటితోపాటు రాజకీయ దాడులు, దౌర్జన్యాలకు కాలనీ గురయింది.

గుంటూరు, కార్పొరేషన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎస్వీఎన్ కాలనీగా అందరికీ సుపరి చితమైన శ్రీనివాసనగర్ కాలనీ చరిత్ర చాలా పెద్దదే. మధ్య తరగతి వర్గం ఆకాంక్షలకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో నిర్మించిన ఈ కాలనీ ఉనికిలోకి రావడానికి ఎందరో ప్రముఖుల కృషి ఉంది. 'దీ గుంటూరు కో ఆపరేటివ్ హౌస్ కన్‌స్ట్రక్షన్ సొసైటీ లిమిటెడ్' పేరుతో నగరంలోని విద్యావంతులు, ప్రముఖులు సొసైటీ ద్వారా కాలనీని నిర్మించుకున్నారు. అక్కడితో తమ పనైపోయిందని అనుకోకుండా ప్రతిక్షణం కాలనీని సంరక్షించుకుంటూ పయనాన్ని సాగించారు. ఈ ఐదు దశాబ్దాల కాలంలో ఎన్నో కుదుపులు, మరెన్నో మలు పులను కాలనీ చవిచూసింది. అయినప్పటికీ కాలనీ ఠీవీ ఏమాత్రం తగ్గకుండా తన పేరు ప్రతిష్ఠలను నిలపుకుంటూ వచ్చింది.

● 1972లో కాలనీ ప్రారంభం
● మధ్య తరగతి గృహావసరాల్లో భాగంగా ఏర్పాటు ● ప్రణాళికాయుత కాలనీ కావడంతో భారీ డిమాండ్

1949లో సొసైటీ ఏర్పాటు..

గుంటూరుకు చెందిన చావలి సూర్యనారాయణ, చేబ్రోలు హనుమయ్య, మరికొందరు ప్రముఖులు కలిసి 1949లో 'దీ గుంటూరు కో ఆపరేటివ్ హౌస్ కన్‌స్ట్రక్షన్ సొసైటీ లిమిటెడ్' పేరుతో సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సొసైటీలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, వైద్యులు, ఇతర ప్రముఖులు ఒక్కొకరు రూ.400 చెల్లించి మొత్తం 3,200 మంది సభ్యులుగా చేరారు. ఈ సొసైటీ ద్వారా ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ పాత పట్టాభిపురం, కొత్త పట్టాభిపురం. ఇన్నర్ రింగు రోడ్డులోని మల్లికార్జునపురం, ఎస్వీఎన్ కాలనీ, పెదకాకాని వద్ద భ్రమరాంబపురం వంటి కాలనీలు ఏర్పాటు చేసుకు న్నారు. సొసైటీ స్థాపకులైన సూర్యనారాయణ, హనుమ య్యలు పట్టాభిపురం రెండు కాలనీలతోపాటు, ఎస్వీఎన్ కాలనీలో కొంత భాగాన్ని నిర్మించారు. ఆ తరువాత గుండవరపు లక్ష్మీ నారాయణ సా రథ్యంలో కొన్ని నిర్మాణాలు చేప ట్టారు. ఆ తరువాత ఆరోపణలు రావడంతో కొన సాగింపు ఆగిపోయింది. దీంతో నల్లమోతు వెంకటరత్తయ్య, మాజీ వైస్ చాన్సలర్లు దావు లూరి రామకోటయ్య, మైనేనీ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎన్నికలు జరిపి ఏర్పాటైన కొత్త కమిటీ ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించుకున్నారు. ఇలా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని కాలనీ ఏర్పాటయింది. 1972లో ప్రారంభమైన ఈ కాలనీ రెండు దశల్లో నిర్మితమైంది. కాలనీలో మొత్తం 216 ఇళ్లు నిర్మించాలని భావించగా ఫేజ్- 1 కింద 102 ఇళ్లు, ఫేజ్- 2 కింద 70 ఇళ్లు నిర్మించారు. మిగిలిన ఇళ్లు ఎవరికి వారుగా నిర్మించుకున్నారు.



కాలనీ ముఖ ద్వారం

కలిసి వచ్చిన నగరీకరణ

ఎస్వీఎన్ కాలనీ అభివృద్ధిలో నగరీకరణదే కీలకపాత్ర అని స్థానికులు చెబుతున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాలన్నీ జనావాసాలతో నిండిపోయాయి. దీంతో అక్కడ కొత్తగా నివాసాలు ఏర్పాటు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో వారందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంగా ఎస్వీఎన్ కాలనీ తెరమీదకు వచ్చింది. దీంతో అందరి చూపు కాలనీపైనే పడింది. దీనికి తోడు విశాలమైన రోడ్లు, నిండైన పచ్చదనంతో ఆహ్లాద కరంగా ఉండే కాలనీ కావడం, కొనుగోలు, అమ్మకాలకు చట్టబద్ధత ఉండటం, సౌకర్యాలు మెరుగుపడడంతో అందరూ కాలనీలో ఇళ్లు తీసుకునేందుకు ముందుకు వచ్చారు. దీంతో కాలనీ దశ ఒక్కసారిగా మారిపోయింది.

'యువగళం' చరిత్రాత్మకం : ఎమ్మెల్యే నసీర్

● 3,842 కి.మీ లోకేశ్ పాదయాత్ర రాష్ట్ర ప్రగతికి నాంది



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువ నాయ కుడు నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్రంలో చరిత్రాత్మక మని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాదయాత్ర కు తొలి అడుగుపడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన గుం టూరులోని తన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే చరిత్ర సృష్టించిన యువగళం పాదయాత్ర 3,842 కిలోమీటర్ల మేర సాగిందని, ఇది రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిందని తెలిపారు. వైసీపీ పాలనలో వేదనపడిన అభాగ్యుల కన్నీళ్లు, దగాపడిన పేదల రోదనలను లోకేశ్ పాద యాత్రలో కళ్లారా చూశారని తెలిపారు. వారి కష్టాలు తీర్చేందుకు మంత్రి లోకేశ్ ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాసరావు, గుడిపల్లి వాణి, పఠాన్ జమీర్, వంగర ఏడుకొండలు, చల్లా ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

దావోస్ వేదికగా ఏపీకి బ్రాండ్ ఇమేజ్

దావోస్ సాక్షిగా సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్ చూపిన చొరవకు దిగ్గజ కంపెనీలు బిందాస్ అయ్యాయని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనస్ ఆరు డిగ్రీల చలిలోనూ దావోస్‌లో పెట్టుబడుల కోసం తీవ్రంగా శ్రమించారని తెలిపారు. అమరావతి రాజధానిలో ఐటీ పరిశ్రమ లు, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఆజాద్ ఇండియా మొబిలిటీ వంటి కంపెనీలు పెట్టుబడు లు పెట్టబోతున్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు చెప్పారు.

ఫిబ్రవరి 10కి రైల్వేశాఖ పనులు పూర్తి చేయాలి

● కమిషనర్ శ్రీనివాసులు



మూడు వంతెనల వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద రైల్వే శాఖ చేపట్టిన నూతన ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేయాల్సిందేనని, ఇప్పటికే ట్రాఫిక్ రద్దీతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రైల్వే అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ మూడు వంతెనల దగ్గర జరుగుతున్న పనులను రైల్వే, జీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ త్వరలో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభం కానున్నందున ఫిబ్రవరి 10 నాటికి పనులు పూర్తి చేసేలా రైల్వే ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో రైల్వే డిప్యూ టీ చీఫ్ ఇంజనీర్ నోయల్, జీఎంసీ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు పాల్గొన్నారు.

అలాగే సోమవారం కమిషనర్ రెడ్డిపాలెం, నగరాలు, గోరంట్ల, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పనులను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆర్టీవో ఆఫీస్ వద్ద గల అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, క్యాంటీన్లలో తాగునీరు, మౌళిక వసతులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో డీఈఈలు రమేష్‌బాబు, శ్రీనివాసరావు, ఆర్వో రవి కిరణ్‌రెడ్డి, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్ ఫిర్యాదులు 24 గంటల్లో పరిష్కరించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్‌యువర్ కమిషనర్ ఫిర్యాదులను 24 గంటల్లో, పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోమవారం డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 25 ఫిర్యాదులు అందుకున్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 48 ఫిర్యాదులు అందాయని వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, ఉపాసెల్ పీవో రామారావు, మేనేజర్ బాలాజీ, బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇచ్చిన ఆదరణ మరే పార్టీ ఇవ్వలేదు : తాడిశెట్టి

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మూడున్నర దశాబ్దాల తమ రాజకీయ కుటుంబానికి టీడీపీ ఇచ్చిన ఆదరణ మరే పార్టీ ఇవ్వలేదని మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి తెలిపారు. శ్రీవెంకటేశ్వరవిజ్ఞాన మందిరంలో జరిగిన బీసీ సభలో తాడిశెట్టి మురళీ టీడీపీ సభ్యత్వాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌ల నుంచి అందుకున్నారు. అంతకుముందు సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీలో చేరిన వెంటనే చీరాల టికెట్ ఆఫర్ చేసిన ఘనత టీడీపీ, సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆ తరువాత ప్రత్తిపాడు నియోజకవర్గంనకు టీడీపీ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా నియమించి పార్టీని గెలిపించే అవకాశం కల్పించారన్నారు. వైసీపీ తమను రాజకీయంగా వాడుకొని అన్ని విధాలుగా అవమానించి అన్యాయం చేసిందన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లకుంట రెండో లైన్‌కి చెందిన బోసి కృష్ణవేణి (50) విద్యుదాఘాతంతో మృతి చెందింది. కృష్ణవేణి ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో వంట మనిషిగా పనిచేస్తోంది. సోమవారం ఉదయం నీళ్ల మోటర్ స్విచ్ వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. కుమారుడు బూసి యేసు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 193 అర్జీలు ● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు(తూర్పు), జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 193 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మితో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదా రుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వారి సంతృప్తి స్థాయిని పెంచేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ భార్గవ్‌తేజ్ మాట్లాడుతూ కోర్టు కేసులను సమీక్షిస్తూ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, డీఎస్‌వో కోమలి పద్మ, డీపీవో నాగసాయికుమార్, డీసీవో వీరాచారి, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డి నేటర్ విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక బృందావన్‌గార్డెన్స్, విభిన్న ప్రతిభావంతుల వసతిగృహంలో ఉన్న ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మించాలని జిల్లా శారీరక విభిన్న ప్రతిభావంతులు అర్జీ అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెలుగు శివప్రసాదు, బ్రహ్మయ్య, బాలశౌరి, సైదారావు, ఏసుబాబు, మరియరాణీ, నాగుల్ మీరావలీ, మస్తాన్‌వలీ, యశోద తదితరులు ఉన్నారు.

● విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, బైరగాని శ్రీనివాసరావు, ఈమని అప్పారావు, విశ్రాంత ప్రొఫెసర్ వేణుగోపాలరావు, భాస్కరరావు తదితరులున్నారు.

● దుగ్గిరాల, శుభమ్ మహేశ్వరీ కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని రైతుసంఘాల అధ్వర్యంలో అర్జీ అందజేశారు. వినతిప త్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు వెంకట్రామయ్య, కోటేశ్వరరావు, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

● రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. కార్యక్రమంలో యశ్వంత్, కిరణ్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఓబీసీల కుల జనగణన చేపట్టాలి : కేసన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేసన, క్రాంతికుమార్, నాగమల్లేశ్వరరావు తదితరులు

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఓబీసీల కుల జనగణన చేపట్టా లని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 9వ తేదీన గుంటూరులో ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహా నిరసన ర్యాలీ చేపడు తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరా వు తెలిపారు. చుట్టుగుంట సెం టర్ సమీపంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. కేంద్రంలో బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్రమోదీ ఓబీసీల కులజనగణనపై తాత్సారం చేయ టం సరికాదన్నారు. గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం నుంచి లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ, అక్కడ నుంచి హిందూ కళాశాల సెంటర్‌లోని పూలే విగ్ర హం వరకు పాదయాత్రగా నిరసన ర్యాలీ చేపడతామన్నారు. సంఘం నేతలు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మల్లేశ్వరరావు, బ్రహ్మానందశర్మ, కోలా అశోక్ ఉన్నారు.

గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలి

● వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆదేశాలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు పోలీస్ అధికా రులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆదేశించారు. సోమవారం ఆయన పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో స్టేషన్ పరిధిలో శాంతి భద్రత సంబంధించిన అంశాలపై చర్చించారు. రౌడీషీటర్స్ కదలికలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి గస్తీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చియార్డు సెక్రటరీగా చంద్రిక

- ఆంజనేయులుని రిలీవ్ చేసిన మార్కెటింగ్ శాఖ
- తన ఒరిజినల్ పోస్టింగ్ అయిన రాజమండ్రికి రీబ్యాక్


చంద్రిక

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు (మిర్చియార్డు) సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా ఎ.చంద్రిక నియమితులయ్యారు. ప్రస్తుతం మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ప్రాజెక్టు అధికారిగా ఉన్న ఆమెను ఏడాది పాటు డిప్యూటేషన్‌పై మార్కెటింగ్ శాఖ నియమించింది. ప్రస్తుత కార్యదర్శి వి.ఆంజనేయులుని తన ఒరిజినల్ పోస్టింగ్ అయిన రాజమహేంద్రవరం ఏఎంసీకి తక్షణం వెనక్కు వెళ్లాల్సిందిగా ఆదేశిస్తూ మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేడో, రేపో చంద్రిక జీవీఎంసీలో రిలీవ్ అయి గుంటూరు మిర్చియార్డుకు వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

తర్జనభర్జనలు జరుగుతూ...

ఇంచుమించు రెండు నెలలకు పైగానే మిర్చియార్డు సెక్రటరీ పోస్టింగ్‌పై ప్రభుత్వస్థాయిలో తర్జనభర్జనలు జరుగుతూ వచ్చాయి. తొలుత మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు యార్డులో వైసీపీ హయాంలో జరిగిన కుంభకోణాలపై ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం రూ. 436 కోట్ల ఆదాయం మిర్చియార్డు కోల్పోయిందని పేర్కొంటూ కొంత మంది అధికారులను బాధ్యులుగా చేసి రిపోర్టు ఇచ్చింది. దీని ఆధారంగా తొలుత అప్పటి మిర్చియార్డు సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డిని ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం ఏఎంసీ సెక్రటరీ వినుకొండ ఆంజనేయులుకు అదనపు చార్జ్ కేటాయించి గుంటూరు మిర్చియార్డులో నియమించింది. ఆయన గత నవంబరు నెలలో బాధ్యతలు స్వీకరించారు. కాగా డిసెంబరు నెలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీ సతీమణి చంద్రిక డిప్యూటేషన్‌పై మిర్చియార్డులో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ ఆమోద లెటర్ ఇచ్చింది. దాంతో మున్సిపల్ పరిపాలన శాఖ ఆమెని మిర్చియార్డు సెక్రటరీగా పోస్టింగ్ చేసేందుకు గత వారం ఎన్‌వోసీని జారీ చేసింది. దీని ఆధారంగా మార్కెటింగ్ శాఖ సోమవారం చంద్రికకు డిప్యూటేషన్‌పై మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పోస్టింగ్ కల్పించి అదనపు చార్జ్ నుంచి వినుకొండ ఆంజనేయులుని రిలీవింగ్ చేస్తూ జీవో ఆర్‌టీ నంబరు. 29ని జారీ చేసింది.

చివరి నిమిషం వరకు హైకోర్టులో పోరాటం

రాజమహేంద్రవరం ఏఎంసీ సెక్రెటరీగా ఉంటూ గుంటూరు మిర్చియార్డు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వినుకొండ అంజనేయులు చివరి నిమిషం వరకు ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నించారు. ఎప్పుడైతే చంద్రిక డిప్యూటేషన్‌పై మిర్చియార్డులో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొన్నారో ఆ విషయాన్ని తెలుసుకొని మార్కెటింగ్ కమిషనర్ ప్రొసీడింగ్‌పై ఆయన హైకోర్టులో కేసు వేశారు. చట్టం ప్రకారం మార్కెటింగ్ స్పెషల్ సీఎస్, కమిషనర్ నడుచుకొనేలా ఆర్డర్స్ పాస్ చేయాలని ఆయన అభ్యర్థించారు. అయితే హైకోర్టు తోసిపుచ్చింది.

మూడున్నరేళ్లలో వంతెనలు పూర్తి చేస్తాం

- నిర్మాణానికి రూ.41 కోట్లు కేటాయింపు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మొదటి ఏడాదిలోపు వంతెనల మంజూరు, రెండున్నర ఏళ్లలో నిర్మాణ పనులు, మూడున్నర ఏళ్ల లోపు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో పని చేస్తున్నాం' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. పెదపలకలూరు ఎల్సీ నంబర్-6కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ఢిల్లీలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరాభివృద్ధికి ఒక స్పష్టమైన ప్రణాళిక రచించా మన్నారు. గుంటూరు జిల్లా వాసుల మూడు దశాబ్దాల కలగా ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ ఆర్‌వోబీ నిర్మాణానికి కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించుకోగలిగామని తెలిపారు. గుంటూరు నల్లపాడు సెక్షన్‌లోని పెదపలకలూరు (పుల్లడిగుంట - పేరేచర్ల రోడ్డు) ఎల్సీ నంబరు 6ను రైల్వే శాఖ ద్వారా మంజూరు చేయించుకున్నామని, ఈ నిర్మాణానికి రూ.41 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఇప్పటిదాకా మంజూరైన ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు.

సచివాలయాల్లో.. సమూల మార్పు



- ఉద్యోగుల హేతుబద్ధీకరణతో సామర్థ్యం పెంపు
- మల్టీ పర్పస్, టెక్నికల్ విభాగాలుగా విభజన
- అవసరమైనవారికి సాంకేతిక శిక్షణ
- ఏఐ, డ్రోన్ టెక్నాలజీని గ్రామాలకు చేర్చే దిశగా అడుగులు

గ్రామ, వార్డు సచివాలయాల స్వరూపమే మారిపోతోందా.. అంటే అవుననే అనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాంతర వ్యవస్థగా మారి అస్తవ్యస్తంగా తయారైన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ లేకపోవడంతో కొంతమందిపై అధిక పనిభారం పడుతుంటే, మరి కొందరు చక్కగా తప్పించుకు తిరిగిన పరిస్థితి గడిచిన ఐదేళ్లలో కనిపించింది. దీనిపై కూటమి సర్కార్ దృష్టి సారించింది. సచివాలయాల సామర్థ్యాన్ని పెంచి, ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో సచివాలయాల్లో సమూల మార్పులు తెస్తోంది. ఉద్యోగుల హేతబద్ధీకరణ ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందించేందుకు ప్రయత్నిస్తోంది.



గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సచివాలయాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ప్రతి 2వేల మందికి ఒక సచివాలయం చొప్పున ఉండగా, దాన్ని కనీసం 2,500 జనాభా, 5 కిలోమీటర్ల దూరాన్ని ప్రామాణికంగా తీసుకుని మార్పులు చేస్తున్నారు. జనసాంద్రత, దూరాన్ని బట్టి 2,500 లోపు జనాభా, 2,500 నుంచి 3,500 జనాభా, 3,501 ఆపై జనాభా కింద సచివాలయాలను విభజించారు. దాంతో పాటు ఉద్యోగులను మల్టీ పర్పస్, టెక్నికల్, ప్రజా ప్రయోజన విభాగాల కార్యదర్శులుగా విభజించనున్నారు. 2,500 లోపు జనాభా ఉంటే ఇద్దరు మల్టీ పర్పస్ ఉద్యోగులు, నలుగురు టెక్ని కల్ ఉద్యోగులు కలిపి మొత్తం ఆరుగురు ఉంటారు. 2,500- 3,500 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీ పర్పస్, నలుగురు టెక్నికల్ ఉద్యోగులు కలిపి ఏడుగురు, 3501 ఆపై జనాభా ఉన్న సచివాలయల్లో నలుగురు చొప్పున మల్టీపర్పస్, టెక్నికల్ ఉద్యోగులు వెరసి 8 మంది ఉంటారు. ప్రస్తుత విధానంలో ఒక్కో సచివాలయానికి 10 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ హేతుబద్ధీకరణ కారణంగా సగటున ఒక్కో సచివాలయానికి 7గురు ఉద్యోగులు సరిపోతారు.

ఉద్యోగుల హేతుబద్ధీకరణ..

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉ ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచివాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యోగులు మిగులుతారు. హేతుబద్ధీకరణతో అందరి ఉద్యోగుల సేవలు సామర్థ్యం మేరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

యాస్పిరేషనల్ కార్యదర్శులు..?

అదనంగా ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. వారి ద్వారా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డ్రోన్ సాంకేతికతను గ్రామాల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. క్రమబద్ధీకరణ అనంతరం గ్రామ, వార్డు సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శి, ఒక వార్డు పరిపాలన కార్యదర్శులు ప్రధాన అధికారులుగా ఉండనున్నారు. సచివాలయాలను నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి కల్పన కార్యాలయాలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఉద్దేశం. మెరుగైన పనితీరు కనబరిచిన సిబ్బందికి బహుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. సచివాలయాల ద్వారా అందజేసే ధ్రువపత్రాలపై ప్రభుత్వ 'చిహ్నం మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలని సీఎం ఆదేశించారు.

ఆర్టీజీఎస్ కేంద్రాలుగా సచివాలయాలు

గ్రామ, వార్డు సచివాలయాలు రియల్‌టైమ్ గవర్నెన్స్ కార్యాలయాలుగా పనిచేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇప్పటికే ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి సచివాలయ విభాగానికి అధిపతిగా ఉంటారు. సచివాలయాలు నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి, విలువ జోడింపు వంటి వాటికి కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల ద్వారా కార్య నిర్వాహకులకు సాంకేతిక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

హాజరు విధానంలో మార్పులు..

గతంలో సచివాలయ ఉద్యోగులు రోజుకు మూడుసార్లు హాజరు నమోదు చేయాల్సి వచ్చేది. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలు, సాయంత్రం 5 గంటలకు హాజరు వేసిన వారికి మాత్రమే వేతనం విడుదల చేసేవారు. కొందరు క్షేత్ర విధుల పేరిట హాజరు వేయకుండా వేతనం తీసుకునేవారు. పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు విధులకు గైర్హాజరయ్యేవారు. దీంతో మిగిలిన ఉద్యోగులపై పని భారం పడేది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రత్యేక యాప్‌లో ప్రతి రోజు ఉదయం 10.30 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే ఉద్యోగుల హాజరు తీసుకుంటారు. రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం హాజరు వేసి సాయంత్రం వేయకపోతే సాధారణ సెలవుగా పరిగణిస్తారు. ఈ యాప్‌ను ప్రభుత్వం ఖజానా శాఖకు అనుసంధానం చేస్తారని తెలుస్తోంది.

రిసార్టు మోసాలపై.. పోలీసుల గురి

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఈ మోసాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యా టకాభివృద్ధి సూర్యలం క హరిత బీచ్ రిసార్టు పేరిట నకిలీ వెబ్‌సైట్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఈ నెల 16న ఏపీటీడీసీ(ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డీజీపీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన డీజీపీ కార్యాలయం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ద్వారా బాధితుల వివరాలతో పాటు గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలతో సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం. ఇప్పటికే నకిలీ వెబ్‌సైట్‌పై సైబర్ సెల్ పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగా, బ్యాంకు ఖాతా వివరాలు జల్లెడ పట్టే పనిలో నిమగ్నమయి ఉన్నారు

పెద్ద సంఖ్యలో పర్యాటకులు...

జిల్లాలో ఉన్న తీర ప్రాంత బీచ్‌లకు వారాంతాలతో పాటు వరుస సెలవుల వేళ కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్, బెంగళూరులో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటారు. వీరిలో ఎక్కువ శాతం మంది రెండు వారాల ముందుగానే ఆన్‌లైన్ ద్వారానే రిసార్టులు బుక్ చేసుకుంటారు. వీరినే లక్ష్యంగా చేసుకుని సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. సైబర్ మోసగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఏడాది కాలం నుంచి వెలుగుచూస్తూనే ఉన్నాయి. ప్రతిసారీ నకిలీ వెబ్‌సైటే వారికి ఆయుధంగా మారుతోంది. బ్యాంకుఖాతాలు, ఫోన్ నంబర్లు ఇవన్నీ తర్వాత దశలోనే. ప్రభుత్వ పర్యవేక్షణలో నడిచే వెబ్‌సైట్‌పై పర్యాటకులకు అవగాహన కల్పించడంలో గానీ, పెద్ద ఎత్తున ప్రచారం చేయడంలో కానీ వ్యవస్థల వైఫల్యం కూడా స్పష్టంగా కనబడుతోంది. పదేపదే సైబర్ మోసాలు వెలుగుచూస్తున్నా వాటిని కనిపెట్టడంలో సదరు విభాగాల నిర్లక్ష్యం కూడా నేరగాళ్లకు కలిసి వస్తోంది. ఇప్పుడు ఏకంగా ఏపీటీడీసీయే రంగంలోకి దిగి డీజీపీకి ఫిర్యాదు చేయడంతో విచారణలో వేగం మొదలైంది. జరిగిన మోసాల్లో అధికశాతం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిటనే జరిగినందున ఇక్కడ నుంచే పోలీస్ శాఖ విచారణ ప్రారంభించింది. ఇదే కాకుండా రాత్రి 12 గంటలు దాటిన తర్వాత గదుల వివరాలు తెలుసుకోవడానికి హరిత బీచ్ రిసార్టుకు ఫోన్ చేసే వారిపై కూడా సైబర్ విభాగం దృష్టి పెట్టింది. వెబ్‌సైట్‌లో పెడుతున్న గదుల ఖాళీ వివరాలు, ఫోటోలు ఇవన్నీ కూడా హరిత బీచ్ రిసార్టు ఒరిజినల్ వెబ్‌సైట్‌తోనే పోలి ఉండడంతో ఆ దిశగా కూడా పోలీస్ శాఖ విచారణ ముమ్మరం చేసింది.

ఈవో సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

- చేయని ఖర్చులు చేసినట్టు చూపి రూ. రెండు కోట్లకు పైగా స్వాహా...
- కమిషనర్‌కు సమగ్ర నివేదిక అందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్


ఈవో సత్యనారాయణరెడ్డి

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేసిన చందంగా దేవాదాయశాఖ ఆదాయ, వ్యయాలకు కాపలాదారుగా ఉండాల్సిన ఆ శాఖ ఈవోనే వివిధ మార్గాల్లో సుమారు రూ. 2 కోట్లకు పైగా స్వాహా చేసినట్టు ఉమ్మడి గుంటూరు జిల్లా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ జరిపిన సమగ్ర దర్యాప్తుల్లో ఆనాటి మందడపు టెంపుల్స్ ఈవో టీ సత్యనారాయణరెడ్డి అవినీతి బాగోతం వెల్లడైంది. ఆ ఈవో ఏ విధంగా దేవుడి సొమ్మును కైంకర్యం చేసింది అంశాల వారీగా నివేదిక అందించారు. ప్రస్తుతం ఈవో సత్యనారాయణరెడ్డి అక్కడ నుంచి బదిలీ అయి బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయ ఈవోగా కొనసాగుతున్నారు. అయితే రెండు, మూడు రోజుల్లో ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి. ఆయన మందడపు గ్రూపు టెంపుల్స్ ఈవోగా ఉన్న సమయంలో కళ్యాణోత్సవాలు, గ్రామోత్స వాలకు ఆయా దేవాలయాలు నోచుకోలేదు. అయినా రికార్డుల్లో మాత్రం రూ. 50 లక్షల 53 వేలకు పైగా ఖర్చు చేసి నాలుగు దేవాలయాల్లో ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించినట్టు లెక్కలు చూపటంతో ఉన్నతాధికారులు నిర్ఘాంతపోయారు. అంతే కాదు అయ్యగారు దేవుడు సొమ్మేగా అడిగేదెవరు అన్నట్టుగా సుమారు రూ.18.50 లక్షలకు ఓచర్లు కూడా లేకుండా ఖర్చు పెట్టినట్లు లెక్కల్లో చూపించారు. అంతే కాదు ఎటువంటి ముందస్తు బడ్జెట్ లేకుండా రూ.26.50 లక్షలకు పైగా ఖర్చు పెట్టినట్లు వెల్లడైంది. ఇక పండుగలకు విద్యుత్ దీపాలు వేయించకుండానే ప్రత్యేకంగా వేయించినట్టు చూపటం, లేని ఉద్యాన వనాలను ఉన్నట్టుగా రికార్డుల్లో చూపించి వాటి సంరక్షణకు రూ. లక్షల్లో ఖర్చు చేసినట్టుగా చూపినట్లు దర్యాప్తులో తేలింది. ఇక ఇదంతా ఒక ఎత్తు అయితే, తన ఇష్టానుసారంగా మూడు బ్యాంకుల్లో దేవాదాయశాఖకు చెందిన సొమ్మును మూడు ఎఫ్‌డీలలో ఉండగా కాలపరిమితి తీరకుండానే విత్ డ్రా చేయడాన్ని ఉన్నతాధికారులు పెద్ద నేరంగా భావిస్తున్నారు. విత్ డ్రా చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలా తీసుకోకుండా ఈవో చేసిన చర్య మూలంగా ఆ దేవాలయాలకు రావాల్సిన రూ. 7 లక్షల రూ. 34 వేలకు పైగా వడ్డీ రూపంలో నష్టపోయాయి. 2019లో విత్‌డ్రా చేయగా ఇప్పటి వరకు కూడా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోలేదు. అంతే కాదు ఇతని నిర్వాకం మూలంగా దేవుళ్ళు కూడా పన్ను ఎగవేతదారుల జాబితాలో చేరిపోయారు. గత ఐదేళ్ళు కూడా ప్రభుత్వానికి ఆలయాల ద్వారా చెల్లించాల్సిన పన్నులను చెల్లించకుండా ఇతని వ్యవహరించిన తీరు పట్ల కూడా ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నారు.

ప్రయోగాత్మకంగా పాప్‌కార్న్

- 92 రోజులకే చేతికి వస్తున్న పంట
- టీడీపీ నేత మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది రైతులు సాగు
- నూజివీడులో పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్
- దళారులతో పని లేకుండా టన్ను రూ.22,500లకు కొంటామని భరోసా


పాప్‌కార్న్ మొక్కజొన్న పైరుకు నీటితడులు అందిస్తున్న టీడీపీ నేత మురళీ కృష్ణ

కొల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాప్‌కార్న్ మొక్కజొన్న రకం నూతనంగా టీడీపీ నేత మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది రైతులు సాగు చేపట్టారు. కొల్లూరు మండలంలోని కొల్లూరు, ఈపూరుతోపాటు జువ్వలపాలెం, తిప్పలకట్ట, కిష్కింద పాలెం తదితర లంక గ్రామాల్లోని రైతులు కూడా పాప్‌కార్న్ మొక్కజొన్న రకం సాగును మురళీకృష్ణ సూచనల మేరకు చేపట్టారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడులో పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఓ సంస్థ నెలకొల్పింది. ఆ సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణను ఆశ్రయించి పాప్‌కార్న్ మొక్కజొన్నపై వివరించడంతో పాటు పంట దిగుబడులను టన్ను రూ.22,500లకు తామే కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. దీంతో ఆయన సాగు చేస్తున్న 80 ఎకరాలలో 40 ఎకరాలు పాప్‌కార్న్ రకాన్ని విత్తి సాగు చేపట్టారు. ఇతర గ్రామాల్లో రైతులను కూడా ప్రోత్సహించడంతో వారు కూడా సాగు వైపు మొగ్గు చూపారు. పాప్‌కార్న్ విత్తనాలు అమెరికా నుంచి దిగుమతి అయ్యాయని, ఎకరాకు ఐదు కిలోల చొప్పున సంస్థ ప్రతినిధులు అందజేశారని టీడీపీ నేత తెలిపారు. పంటకు చీడ పీడలు ఆశించకుండా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలతో పాటు అవసరమైన రసాయన మందులను కూడా సంస్థ ప్రతినిధులు సూచించడంతో పాటు అవసరమైన రైతులకు అందజేసినట్లు చెప్పారు. ఇప్పటికే లంక గ్రామాల్లో సాగు చేసిన రైతులకు 3.5 టన్నులు దిగుబడులు వచ్చాయనీ, వాటిని సంస్థ ప్రతినిధులే కొనుగోలు చేసి నగదు చెల్లింపులు జరిపి తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. దళారులు, మార్కెట్ ఒడుదొడుకులతో పని లేకుండా కంపెనీయే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

ఐదు టన్నుల దిగుబడులే లక్ష్యంగా..

పాప్‌కార్న్ మొక్కజొన్న పంట ఐదు టన్నుల దిగుబడులే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు మురళీకృష్ణ పేర్కొన్నారు. సాధారణ మొక్కజొన్న పంట కాల పరిమితి 120 రోజులు కాగా, పాప్‌కార్న్ మొక్కజొన్న పంట 92 రోజులకే చేతికి వస్తుందన్నారు. పైరు కూడా సాధారణ రకాల కంటే కొంచెం తక్కువ ఎత్తులో పెరుగుతుందన్నారు. దీనివలన ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతినే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెప్పారు. సాగు చేస్తున్న పంటను గమనిస్తూ నీటి యాజమాన్య పద్ధతులతోపాటు చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారీ చేయడంతో పాటు ఎరువులు కూడా సకాలంలో సరైన మోతాదులో పంటకు అందిస్తున్నట్లు చెప్పారు. పంట ఆశాజనకంగా ఉందనీ, తాను ఆశించిన మేర ఫలితాలు వస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం తనతోపాటు కూలీలు కూడా శ్రమిస్తున్నారని చెప్పారు. వచ్చే దిగుబడులను బట్టి రైతులు పాప్‌కార్న్ సాగుకు మరింత మంది మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న పాప్‌కార్న్ రకం మొక్కజొన్న పైరు



1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

(5వ పేజీ తరువాయి)

నగర, పట్టణ, మండల శివారు ప్రాంతాల్లో స్వల్పంగా పెరుగుదల

బహిరంగ మార్కెట్‌లో కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తగ్గింపునకు నిర్ణయం

కసరత్తు చేసి ఉన్నతాధికారులకు జాబితాలను పంపారు. దీనిపై జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఆయా ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు, రేపు మిగిలిన ప్రక్రియను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల వారీగా ఏపిడి నెంబర్ల పరిధిలో ఏ స్థాయిలో పెంచుతున్నారని దానిని ఆన్లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. వాస్తవానికి రూరల్ ప్రాంతాల్లో ప్రతి రెండేళ్ళకు ఒకసారి, అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. అయితే 2019 తర్వాత రూరల్ ప్రాంతంలో ఇంతవరకు భూముల మార్కెట్ విలువలను సవరించలేదు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్‌లో కొంతవరకు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కొంతమేర భూముల మార్కెట్ విలువలను పెంచారు. దీంతో కొత్త జిల్లాలు ఏర్పాటైన ప్రాంతాల్లో కొంతమేర రిజిస్ట్రేషన్ చార్జీలు 2022లో పెరిగాయి. ఆ తరువాత 2023 లోనూ అక్కడక్కడ భూములలో సవరించారు ముఖ్యంగా ఒక్కో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా భూముల క్రయ, విక్రయాలు జరిగే గ్రామాలు, అదేవిధంగా బహిరంగ మార్కెట్లో భూముల మార్కెట్ విలువలు ఎక్కువగా పెరిగిన చోట కొంతమేర మార్కెట్ విలువలను పెంచారు. అయితే 2024లో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ తదితర అన్ని ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, పొన్నూరు తదితర అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగబోతున్నాయి. నగర, పట్టణ ప్రాంతాల్లోని వ్యాపార వాణిజ్య కూడళ్ళలోనూ, ధనిక వర్గాలు ఉండే ప్రాంతాల్లోనూ భారీగా కాకపోయినప్పటికీ 15 నుంచి 25 శాతం మేర భూముల మార్కెట్ విలువలను పెంచబోతున్నారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్లలో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పెరగబోతున్నాయో అంతే స్థాయిలో భూముల మార్కెట్ విలువలను యధాస్థితిలో కొనసాగించబోతున్నట్లు రిజిస్ట్రేషన్ అధికార వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా ఈ దఫా అనేక చోట్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని భూముల మార్కెట్ విలువలను తగించబోతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు మార్కెట్లో కంటే కూడా ప్రభుత్వ మార్కెట్ విలువలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువలను తగ్గించాలంటూ ఎంతోకాలంగా ప్రజల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు, అలాగే ప్రభుత్వ మార్కెట్ ధరలను బేరీజు వేసుకుని సబ్ రిజిస్ట్రార్ లు ఆయా ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని నిర్ణయించారు.



రియల్ రంగంపై పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంపుదల రియల్‌ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రియల్ వేస్టేట్ రంగం ఎంతో కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలతో సమానంగా ప్రభుత్వ మార్కెట్‌లో భూముల ధరలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేసేవారు తప్ప, వ్యాపార పరంగా స్థలాలు, పొలాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్స్ ఆలోచన లేకుండా ఒప్పంద పత్రాలకు పరిమితమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా ఒప్పందాలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆయా స్థలాల క్రయవిక్రయదారులు ఇబ్బందులు, కోర్టు వివాదాలు ఎదుర్కొంటున్నారు. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇవేమిపట్టవన్నట్లుగా భూముల మార్కెట్ ధరలు పెంచుకుంటూపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసిన ట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.3 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 126 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 176 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 250 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 186 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 60 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 566 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

498 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 498 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,000, గరిష్టధర రూ.11,800, మోడల్ ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,000, గరిష్టధర రూ.11,800 మోడల్‌ధర రూ.11,300 పలికాయి.

నేడు ప్రజాదర్బార్

మంగళగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు స్థానిక టీడీపీ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని టీడీపీ వర్గాలు కోరాయి.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

తాడేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు అన్నారు. సోమవారం మండలంలోని కుంచనపల్లిలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పశుపోషకాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ తగిన నిధులు కేటాయిస్తుందన్నారు. పశువుల ఆరోగ్యానికి ఉత్పాదకను పెంచడానికి వ్యాధులు నియంత్రించడానికి పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలోనూ అవగాహన సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాడి రైతులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కుంచనపల్లి గ్రామ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకల రాజా, డాక్టర్ వై పద్మావతి, ఏడీ డాక్టర్ వి.శ్రీనివాసరావు, మండల పశు వైద్యాధికారి నరేంద్రరెడ్డి, దాశెట్టి అరుణ, కొలంటి మహేష్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

మంగళగిరి సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండోవార్డుకు చెందిన ఓ మహిళ తన నివాసంలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి పేరు మాధవి (34) అని, గతంలో ఆమె మెడికల్ షాపును కూడ నిర్వహించిందని పట్టణ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వినోద్‌కుమార్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

కాకుమాను(చిన్నలింగాయపాలెం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నలింగాయపాలెంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. తహసీల్దార్ వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముద్రబోయిన సాంబయ్య, తిరుపతయ్యలకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు ఆయిల్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చే సమయానికి పూర్తిగా దగ్ధమయ్యాయని చెప్పారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ 20 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు బాధితులకు పంపిణీ చేశారు. ప్రమాదంపై నివేదికను ఉన్నతాదికారులకు అందజేస్తామని వివరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్ఐ సింగారావు, వీఆర్వో తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తుళ్లూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరావు అన్నారు. సోమవారం ట్రాపిక్ రూల్స్‌పై అవగాహన ర్యాలీ పోలీసులు నిర్వహించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఏపీ హైకోర్టు వర కు పోలీసులు హెల్మెట్‌లు ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. చాలా మంది నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాల భారిన పడి మరణిస్తున్నారని సీఐ అన్నారు. రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు తప్పుతాయని ప్రాణాపాయం నుంచి బయటపడతారని ఆయన తెలిపారు.

పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టాలి

● సీపీఎం మండల నేత వెంకటేశ్వరరావు

తాడేపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 2016 కృష్ణా పుష్కరాల్లో ఇళ్లు తొలగించిన వారికి రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం తాడేపల్లి కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని సుందరయ్యనగర్, రామయ్య కాలనీ, కృష్ణనగర్ సచివాలయం ఉండవల్లి, కొత్తూరు తదితర ప్రాంతాల సచివాలయాల వద్ద సీపీఎం శ్రేణులు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా పశువుల ఆస్పత్రి వద్ద బకింగ్ హామ్ కెనాల్‌పై కొత్త బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాన్ని మార్చిన యువగళం

టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు

మంగళగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని సమూలంగా మార్చి వేసిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై ఈ సోమవారానికి రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ లోకేశ్ పాదయాత్రను పట్టుదలగా నిర్వహించారన్నారు. ఈ యాత్ర నాటి వైసీపీ అరాచకపాలకుల వెన్నులో వణుకు పుట్టించిందని.. టీడీపీ కేడర్‌లో నూతనోత్తేజాన్ని కలిగించిందన్నారు. ప్రజల కష్టాలు వింటూ, కన్నీళ్లు తుడుస్తూ సాగిన ఈ పాదయాత్ర ప్రజాచైతన్యంలో సంపూర్ణ విజయం సాధించిందన్నారు. అధికారంలోకి వచ్చాక యువతకు అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలను కల్పిస్తానంటూ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలుకు ప్రణాళికబద్ధమైన కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడు మాసాల్లోనే రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు, నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయని పోతినేని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నాయకులు మల్లవరపు వెంకటరావు, పోలుమట్ల ప్రేమ్‌కుమార్, గాదె పిచ్చిరెడ్డి, వాకా మాధవరావు, కొదమల సైమన్, భైరుబోయిన శ్రీనివాస్, యలమంచిలి పద్మజ, వాసా పద్మావతి, అప్పలశాంతి, విజయలక్ష్మి, ఊట్ల దుర్గా మల్లీశ్వరి, దిడ్ల సత్యానందం, ఎడ్లూరి చిరంజీవి, విలియం, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి/తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాన్ని మార్చి వేసిందని, టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు చెప్పారు. పట్టణ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ నారా లోకేశ్ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో యువగళం పాదయాత్ర నిర్వహించారన్నారు. ప్రజల కష్టాలు వింటూ కన్నీళ్లు తుడుస్తూ సాగిన యువగళం పాదయాత్ర ప్రజాచైతన్యంతో సంపూర్ణ విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దారా దాసు, తాడిబోయిన భాస్కర్, కొయ్యగూర మహాలక్ష్మి, కే నిర్మల, సాగర్, ఇట్టా భాస్కర్, కేశి వెంకటేశ్వరరావు, అద్దంకి మురళి, మండవ గోపాలరావు, సాంబయ్య, అంజిరెడ్డి, శ్రీనివాసరావు, చాంద్ బాషా, శ్రీధర్‌రెడ్డి, మధు, పీటర్ పాల్, అన్నెం కుసుమ, కృష్ణవేణి, శిరీష, తదితరులు పాల్గొన్నారు. మండల కార్యాలయంలో అమరా సుబ్బారావు పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, కానుగోలు కోటేశ్వరరావు, కంచర్ల రంగారావు, అరవపల్లి శ్రీనివాస్, కాసరగడ్డ శ్రీనివాస్, గాదె వినయ్, దాశెట్టి అరుణ, పఠాన్ జానీ ఖాన్, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో కేక్ కట్ చేస్తున్న వల్లభనేని వెంకట్రావు



దుగ్గిరాల టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, శ్రీఅనిత తదితరులు

యువగళం టీడీపీ విజయానికి నాంది

● ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్

దుగ్గిరాల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువగళం ద్వారా నారా లోకేశ్ పార్టీ కేడర్‌లో నింపిన మనోధైర్యమే రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటుకు బీజం వేసిందని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. యువగళం పాదయాత్రను ప్రారంభించి, రెండేళ్లు పూర్తయిన సందర్భంగా దుగ్గిరాలలోని పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనితలు కేక్‌ను కట్‌చేశారు. జబీన్ మాట్లాడుతూ వైసీపీ టీడీపీ నాయకులను వేధింపులకు గురిచేస్తూ, అడుగడుగునా అవాంతరాలు సృష్టించినప్పటికీ రెట్టించిన ఉత్సాహంతో లోకేశ్ పాదయాత్రను కొనసాగించారన్నారు. శ్రీఅనిత మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం, రాష్ట్రంలో సమస్యలను తెలుసుకుంటే ప్రజల్లో మమేకమై దిగ్విజయంగా నాడు పాదయాత్రను పూర్తిచేసిన లోకేశ్ భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల కాలంలో తాను యిచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ వచ్చారన్నారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఎరుకల సేవాసంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గరికా శ్రీనివాసరావు, పర్వతనేని హర్షవర్ధన్, దేవరపల్లి చంటి, గారపాటి కోటేశ్వరరావు, సలావుద్దీన్, కరీముల్లా, పులివర్తి రమేష్, వీరంకి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటనతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

● రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య

మంగళగిరి సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ దావోస్ పర్యటనతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రాబోతున్నాయని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే రాష్ట్రంలో పారిశ్రామికరంగం తిరిగి జీవం పోసుకుంటుందని ఆయన చెప్పారు. దావోస్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలతో సమావేశమై రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకువస్తున్నారని అన్నారు. వరల్డ్ ఎకనామిక్‌ఫోరంలో ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలబెట్టారన్నారు. తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసిన చంద్రబాబు నేడు మరో ఇన్నోవేషన్‌కు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఏఐ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాన్ని రాబోయే రోజుల్లో మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు చంద్రబాబు తనదైన శైలిలో వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలను యువతకు అందించాలన్న లక్ష్యంతో చంద్రబాబు, లోకేశ్‌లు దావోస్‌లో ఎంతగానో శ్రమించారన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ తదితరులు ముఖ్యమంత్రి విజన్‌ను మెచ్చుకోవడంతోపాటు రాష్ట్రంలో పెట్టుబడులకు హామీలను ఇవ్వడం విజన్-2047 విజయానికి సంకేతాలని చెప్పారు.

13 మద్యం షాపులకు గెజిట్ నోటిఫికేషన్

● ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి అరుణకుమారి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో గౌడ, గౌడ సామాజిక వర్గాలకు 13 మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి అరుణకుమారి తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ సంబంధిత ఎక్సైజ్ స్టేషన్లలో ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తు చేసుకోదలచినవారు రూ.2 లక్షలు దరావత్తు కింద (నాన్ రిఫండబుల్) డీడీ చెల్లించి దరఖాస్తు చేయవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు సబ్‌క్యాస్ట్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రం, ఏదేని గుర్తింపుకార్డును జత పరచాలన్నారు. దరఖాస్తులను వచ్చే నెల 7న గుంటూరు అబ్కారి శాఖ కార్యాలయంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని ఆమె తెలిపారు.

అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలి

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల, శుభమ్ మహేశ్వరీ కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని రైతుసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. నష్టపోయిన ప్రతి క్వింటాల్‌కు రూ.7 వేలు ఇస్తామని చెప్పి ఆరు నెలలు గడిచినా పరిహారం అందలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. పైగా చాలమంది రైతులు బాండ్లు అందజేయలేదని, కొంత మంది రైతులు కూడా చనిపోయారని అన్నారు. బాండ్లు అందజేసే కార్యక్రమాన్ని పొడిగించాలని, చనిపోయిన రైతులను గుర్తించి పరిహారం ఆ కుటుంబాలకు అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు వెంకట్రామయ్య, కోటేశ్వరరావు తదితరులున్నారు.

పరిహారం అందించాలి

2023లో పిడుగుపాటు గురై కుడిచేతిని కోల్పోయానని, పరిహారం కోసం ప్రధామంత్రి సురక్ష బీమా యోజనకి దరఖాస్తు చేసుకున్నానని కానీ ఇంత వరకు పరిహారం అందలేదని వట్టిచెరుకూరు మండలం, డోకిపర్రు గ్రామా నికి చెందిన గుంజి వీరాంజనేయులు సోమవారం కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దీనిపై బ్యాంకు అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరారు.

సూర్యనారాయణ కుటుంబానికి చిల్లపల్లి పరామర్శ



ఉప్పు సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన చిల్లపల్లి

తాడేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జనసేన మంగళగిరి ఇన్‌చార్జి, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సోమవారం ఉండవల్లిలోని ఉప్పు సూర్యనారాయణ సతీమణి, జనసేన వీరమహిళ వసుంధరాదేవి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో ఉన్న ఆవిడను పరామర్శించి ఆమెకు కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఇంటికి వచ్చి పరామర్శించిన చిల్లపల్లికి సూర్యనారాయణ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ చక్కాకుల కోటేష్ బాబు, బడే కోమలి, మధు, చిట్టెం అవినాష్, జొన్నా రాజేష్, రాజా రమేష్, దినేష్ చక్రవర్తి, మేకా నాని, దాసరి మల్లేశ్వరరావు, బాబా శంకర్, తంబి బస్వి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

దుగ్గిరాల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో ప్రధాన సమస్యలపై విశ్రాంత ఎస్ఐ రాధాకృష్ణమూర్తి సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. మురుగునీటి నిల్వలతో దోమలబెడద ఎక్కువైందని, తగు చర్యలు తీసుకుని, జ్వరాల బారిన పడకుండా చూడాలని, పందులు తిరుగుతుండటం, ఇబ్బందికరంగా మారిందని, గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఐ సునీతలకు వినతిపత్రం అందించారు.



ఎంపీడీవో, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేస్తున్న విశ్రాంత ఎస్ఐ

ప్రతి కార్యకర్త సరస్వతిని స్ఫూర్తిగా తీసుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తాడేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్రాంతంలో బూరుగ సరస్వతి మహిళా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఆమె స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రకాష్‌నగర్‌లో సోమవారం బూరగ సరస్వతి సంస్మరణ సభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతానికి ఆమె కట్టుబడి పని చేసిందని అన్నారు. కాగా ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిగురుపాటి బాబూ రావు, ఎంబీవీకే కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, బూరగ వెంకటేశ్వరరావు, జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మేరి, తులశమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మంత్రి రైతులకు ఒరగ బెట్టిందేమీ లేదు

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్

మేడికొండూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గానికి ప్రతినిధి వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పటికి రైతులకు ఒరగబెట్టింది ఏమీలేదని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు. మేడికొండూరు మండలం పేరేచర్ల సమీపంలోని బండారుపల్లి మేజర్ కాలువ పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా వ్యవసాయం ఇబ్బందుల్లో పడిందని, రైతులు అనేక రకాలుగా నష్టపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి రైతు సమస్యలపై దృష్టి సారించిందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని కాలువల ద్వారా నీరు అందడం లేదని రైతులు చెప్పారని, వెంటనే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి చివరి భూములకు సైతం నీరందించాలన్న లక్ష్యంతో కాలువలో పూడికతీత, పిచ్చిమొక్కలు తొలగింపు చేపట్టామన్నారు. గుంటూరు బ్రాంచి కాలువ పరిధిలో బండారుపల్లి మేజరు కాలువలో పిచ్చి మొక్కలు తొలగించేందుకు సుమారు పది లక్షల రూపాయలు కేటాయించి పనులను ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా మిర్చి పంటను రైతులు పండిస్తారని, ఈపంటకు మరో రెండు నెలల పాటు నీరు అవసరమవుతుందని అన్నారు. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా గత ప్రభుత్వ హయాంలో కాలువను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదలి వేయడం వల్ల కాలువల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి నీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదని, నీరు విడుదల పెంచితే కట్టలు తెగి నీరు వృధాపోతుందన్నారు. పిచ్చి మొక్కలు తొలగించి చివరి భూములకు కూడా నీరందించాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కెనాల్స్ డీఈ డి.శ్రీకాంత్, పాములపాటి శివన్నారాయణ, నార్నె శ్రీనివాసరావు, సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, రాచర్ల నాగబాబు, కాటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

మండలిలో గళమెత్తేది పీడీఎఫ్ సభ్యులే

కేఎస్ లక్ష్మణ్‌రావు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావు

మంగళగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సమస్యలను గురించి శాసనమండలిలో ధైర్యంగా మాట్లాడగలిగే సత్తా పీడీఎఫ్ సభ్యులకు మాత్రమే ఉందని కృష్ణా, గుంటూరు జిల్లాల ఉమ్మడి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావు అన్నారు. వీజేపీ అండ్ డీఎల్‌బీ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీ అంజనేయులు అధ్యక్షత వహించారు. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ మార్చిలో జరుగనున్న ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మంగళగిరి ప్రాంతం ఎంతో చైతన్యవంతమైందని ఇక్కడ ఉన్న ప్రజాసంఘాల కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు కృషి చేసి తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజారోగ్యవేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్, ఏ శ్రీనివాసరావు, సీహెచ్ ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పశువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పశువులు ఆరోగ్యంపై పశు పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డిలు చెప్పారు. సోమవారం మండలంలోని కఠెవరంలో పశువైద్య శిబిరంలో 93 పశువులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పశువైద్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 8 అర్జీలు

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. తన కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

పురపాలక సంఘానికి ఒక అర్జీ

తెనాలి మారీసుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ అందినట్లు మున్సిపల్ మేనేజర్ చండీ దేవసేన తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఇంటి స్థలం సరిహద్దులు సర్వే చేయాలని కోరుతూ అర్జీ అందించారన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయానికి ...

తెనాలి అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 14 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 6, మున్సిపల్ 2, సబ్ రిజిస్ట్రార్ 2, సర్వే, హౌసింగ్, అగ్రికల్చర్, పోలీసు శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందజేశారు.

పొన్నూరులో తొమ్మిది ఫిర్యాదులు

పొన్నూరు టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సర్వే కోసం ఐదు అర్జీలు, మున్సిపల్ సర్వే కోసం 1, పంచాయతీరాజ్ సమస్యపై 1, అడంగల్ కరెక్షన్ కోసం 1, రోడ్ల భవనాల శాఖ సమస్యపై 1 ఫిర్యాదు అందాయి. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు గెజిట్ నోటిఫికేషన్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో గౌడ, గౌడ సామాజిక వర్గాలకు 13 మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి అరుణకుమారి తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ సంబంధిత ఎక్సైజ్ స్టేషన్లలో ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తు చేసుకోదలచినవారు రూ.2 లక్షలు ధరావతు కింద (నాన్ రిఫండబుల్) డీడీ చెల్లించి దరఖాస్తు చేయవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు సబ్ క్యాస్ట్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రం, ఏదేని గుర్తింపుకార్డును జత పరచాలన్నారు. దరఖాస్తులను వచ్చే నెల 7న గుంటూరు అబ్కారీ శాఖ కార్యాలయంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని ఆమె తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గురవయ్యకాలనీకి చెందిన ఇద్దరు యువతులు ఇంటినుంచి అదృశ్యమైనట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదుమేరకు సోమవారం కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. గత శనివారం ఉదయం గురవయ్యకాలనీకి చెందిన శైలజ(20), అదే వీధిలో ఉండే బాలిక బయటకు వెళ్లివస్తానని చెప్పి సాయంత్రమైనా తిరిగి ఇంటికిరాకపోవడంతో వారి కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకపోయింది. వారివద్ద ఉన్న సెల్‌ఫోన్స్ కూడా స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. శైలజ వివాహిత, ఈమె తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకట్రావు

కమీషన్ మర్చంట్స్ కార్యవర్గ ఎంపిక

తెనాలి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ హాలులో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షునిగా సుగ్గల వెంకటప్పయ్య, కార్యదర్శిగా అద్దంకి రామమోహనరావు, కోశాధికారిగా పి.సామిరమేష్, ఉపాధ్యక్షుడిగా ఆదిశేషారావు, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సలహాదారుగా కొండలరావులు ఎన్నికయ్యారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, పలువురు వ్యాపారులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

పవర్ లిఫ్టింగ్‌లో రేవతికి సిల్వర్ మెడల్



పతకాలతో రేవతి

తెనాలి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెనాలికి చెందిన వక్కలగడ్డ రేవతి ద్వితీయ స్థానం సాధించింది. ఛత్తీస్‌ఘడ్‌లోని రాజారా జిల్లాలో ఈ నెల 18 నుంచి పోటీలు నిర్వహించారు. స్క్వాడ్ 135 కేజీ, బెంచ్‌ప్రస్ 57.5 కేజీ, డెడ్‌లిఫ్ట్ 130 కేజీలో సిల్వర్ మెడల్ సాధించింది. రేవతిని పలువురు క్రీడాకారులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

● వార్డుల వారీగా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నా
● గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలపేరుతో దోపిడీ
● వార్డు పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్



మరుగుదొడ్లు, శానిటేషన్ సమస్యలపై మంత్రికి తెలుపుతున్న బ్యాంకర్స్ కాలనీ మహిళలు

తెనాలి మారీసుపేట, జనవరి27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించాలని పాదయాత్రగా వార్డులో పర్యటిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం పట్టణంలోని 1, 2 వార్డుల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో కలిసి పర్యటిస్తూ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పింఛన్లు రావడం లేదని, రేషన్‌కార్డులు అందించాలని, మురుగు సమస్యలతో సతమతమవుతున్నామని, జగనన్న కాలనీల పేరుతో కాంట్రాక్టర్లు రూ.23 వేల నుంచి 50వేల వరకూ డబ్బులు లబ్ధిదారుల నుండి గృహనిర్మాణాలకు తీసుకుని ప్రభుత్వానికి జమచేయకుంటా తమకు తిరిగి చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. బ్యాంకర్స్ కాలనీకి చెందిన మహిళలు తమ కాలనీలో సంవత్సరం నుండి శానిటేషన్ పనులు చేపట్టడం లేదని అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఇంకా పలు సమస్యలపై మంత్రి మనోహరుకు పలువురు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత శాఖల అధికారులను పిలిచి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టిడ్కో ఇళ్లపై రాబోయే బడ్జెట్ సమావేశంలో చర్చించి వాటిపై స్పష్టమైన హామీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తొలుత మంత్రి మనోహర్ వార్డులోని పేరంటాలమ్మ తల్లి దేవస్థానాన్ని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. కూటమి శ్రేణులు మంత్రి మనోహర్‌ను పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని తీర్చిదిద్దుతా: మంత్రి మనోహర్

పట్టణాన్ని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు తెనాలిలో వార్డుల వారీగా పాదయాత్ర చేపట్టిన మంత్రి మనోహర్ ప్రజల సమస్యలు తెలుసుకుని అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మాటలు తప్ప చేతల్లో తెనాలి ప్రాంతం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని గుర్తించినట్లు చెప్పారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి నెలలో రైతులకు పంట సాగుకు సకాలంలో నీరందేలా డ్రెయిన్లు పూడికలు తీయించి పట్టణంలోని మురుగు సమస్యను పరిష్కరించేలా కాలువల మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. జగనన్న కాలనీల పేరుతో నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం పెద్దఎత్తున దోపిడీకి తెరలేపిందని వాటిపై విజిలెన్స్ విచారణ చేపట్టి పేదలకు మంచి జరిగేలా చూస్తానని మంత్రి మనోహర్ వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి: వెంకయ్య

ఇస్త్రీ చేస్తూ జీవనం సాగించేవాడిని, పక్షవాతం రావడంతో కాలు చేయి పడిపోయి పనిచేసుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం ద్వారా తనకు ఏటువంటి సాయం అందడంలేదు. కుటుంబపోషణ భారంగా మారింది. మందుల ఖర్చు, మరో పక్క ఇల్లు గడవటానికి ఎటువంటి ఆసరా లేకుండా పోయిందని మంత్రి మనోహర్ ఎదుట బాధితుడు డి.వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కనీసం పింఛన్ అయినా అందిస్తే కొంత మేర తనకు తన కుటుంబానికి మేలు చేసిన వారవుతారని మంత్రి మనోహర్‌కు విన్నవించుకున్నారు.

పంట భూమి మురుగునీటితో కలుషితమవుతోంది

● మంత్రికి జెట్టి పద్మావతి వినతి

తమ మూడు ఎకరాల పంట భూమికి సాగునీరు అందటం లేదని అందుకు కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు ప్రణాళికాబద్ధంగా వేయకపోవడంతో పంట పొలాల్లోకి మురుగు నీరు ప్రవహించి దోమల ఉధృతికి చీడపీడలు పెరిగి పంటలు దెబ్బతినటమే కాక బీడు భూములుగా మారుతున్నాయని జెట్టి పద్మావతి అనే మహిళ మంత్రి మనోహర్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షం కురిస్తే కాలనీలోని నీరంతా తమ పొలాల్లోనే ఉంటుందని దీంతో పంటలు మునిగి నష్టం వాటిల్లుతుందని వివరించారు. దీనిపై చర్యలు తీసుకుని తమకు మంచి జరిగేలా చూడాలని కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా విద్యనందిస్తాం

● మంత్రి మనోహర్

తెనాలి మారీసుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం పట్టణంలోని ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌ను అధికారులతో కలసి మంత్రి మనోహర్ సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, టీచర్ల బోధనపై అడిగి తెలుసుకున్నారు. క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యనభ్యసించి ప్రభుత్వానికి, కుటుంబసభ్యులకు, స్కూల్‌కు మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. స్కూల్‌లో తాగునీరు ఇతర సౌకర్యాలపై నెలకొని ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమిషనర్ బండి శేషన్న, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న గణపతి సచ్చిదానందస్వామి, ప్రతిష్ఠించిన హనుమంతుని విగ్రహం

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

● హనుమ విగ్రహ ప్రతిష్ఠలో గణపతిసచ్చిదానంద స్వామి

తెనాలి రూరల్, తెనాలి అర్బన్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుని భావితరాలకు అందించాలని అవధూత దత్తపీఠాధిపతి జగద్గురువు సచ్చిదానందస్వామి అనుగ్రహ భాషణం చేశారు. సోమవారం మండలంలోని పెదరావూరులో అవధూత దత్త పీఠంలో 18 అడుగుల ఏకరాతి హనుమంతుని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెదరావూరుకు చెందిన కొడాలి విఠల్ బాబు, రాధా, శివ ఆధ్వర్యంలో దత్తస్వామి ఆశ్రమం కోసం నాలుగు ఎకరాల భూమి విరాళం ఇచ్చారు. భూమిలో గురు నిలయం నిర్మించారు. ఆవరణలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. గవిని రాజేంద్ర, ప్రసూన పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని రామలింగేశ్వరపేటలో కొడవటిగంటి భరతశాస్త్రి కుటుంబ సభ్యులు స్వామిపీఠం నిమిత్తం తమ గృహాన్ని సమర్పించారు. చెంచుపేటలోని పద్మావతి కళ్యాణ మండపంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కల్లూరి వెంకటసూర్యనారాయణమూర్తి, కొత్త సుబ్రహ్మణ్యం, జనార్ధనరావు, నన్నపనేని రాజకుమారి పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి



కూరగాయల ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రకృతివ్యవసాయ సిబ్బంది

కొల్లిపర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలను కొల్లిపర మండల మోడల్ టీమ్ ప్రదర్శన నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు నాగజ్యోతి, సుధారాణి, ఎంటీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అప్రమత్తగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



లెప్రసీ సర్వేను పర్యవేక్షిస్తున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం, సహాయ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. సోమవారం స్థానిక నాజరుపేటలో లెప్రసీపై జరుగుతున్న సర్వేను జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, అందె చంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, శివగణేష్, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, దాసరి నాగమల్లేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు మంత్రి మనోహర్ అభినందన



తహసీల్దార్ గోపాలకృష్ణను అభినందిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా బెస్ట్ తహసీల్దార్‌గా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్న తహసీల్దార్ గోపాలకృష్ణను మంత్రి మనోహర్ అభినందించారు. సోమవారం మంత్రి మనోహర్‌ను తహసీల్దార్ గోపాలకృష్ణ కలిశారు. మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగానే గుర్తిస్తూ సత్వరమే పరిష్కరించి ప్రభుత్వానికి మరింత మంచిపేరు తేవాలని మనోహర్ సూచించారు.

జనసేన కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి మనోహర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి మంత్రి మనోహర్‌ను కలిసి వారి సమస్యలు తెలిపేందుకు ప్రజలు కార్యాలయానికి పెద్దఎత్తున విచ్చేశారు. మంత్రి మనోహర్ వారు తెలిపే ప్రతి సమస్యను సావధానంగా ఆలకించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కు.ని. ఆపరేషన్ వికటించి మహిళ మృతి

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చిన ఓ మహిళ చికిత్స వికటించి మృతి చెందింది. మంగళగిరి మండలం ఎర్రబాలెంకు చెందిన గాజుల పావని (36) ఈ నెల 24న తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. వైద్యులను సంప్రదించగా శస్త్ర చికిత్స చేస్తామని చెప్పి, ఆపరేషన్ చేయగా యూరిన్ బ్లాడర్ కట్ అయింది. దానిని వైద్యులు సరిచేయకుండా ఆపరేషన్ విజయవంతమైందని తెలిపారు. బాధితురాలికి కడుపు నొప్పి రావడంతో తిరిగి వైద్యులను సంప్రదించారు. స్కానింగ్ ఇతర పరీక్షలు జరిపి బ్లాడర్ కట్ అయినట్లు గుర్తించారు. ఆమెకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. ఘటనపై కుటుంబ సభ్యులు గుంటూరులోని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా తెనాలిలో చేయాలని సూచించారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వీల్‌చైర్స్ వితరణ

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రోగులకు ఉపకరించే పరికరాలను దాతలు సోమవారం అందజేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన కల్పవృక్షా సేవా సొసైటీ సభ్యులు రెండు స్ట్రెచ్చర్‌లు, ట్రాలీలు, నాలుగు వీల్ చైర్లు అందించారు.

ఉత్తమ అవార్డు గ్రహీత తహసీల్దార్‌కు సన్మానం

కొల్లిపర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ ఉత్తమ అవార్డు అందుకోవడంపై సోమవారం వివిధ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భీమవరపు పద్మావతి మాట్లాడుతూ కష్టపడి పని చేసేవారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రాజేష్, తహసీల్దార్ సిద్ధార్థ, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, ఆర్ఐ వంశీకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ తేజనాగకోటికిరణ్, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు అభినందించారు.

మంద కృష్ణకు పద్మశ్రీ ఇవ్వటంపై హర్షం

పెదకాకాని, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించిన సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వద్ద ఉద్యోగులు సోమవారం కేక్ కట్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో 30 సంవత్సరాలు ప్రజాసంబంధాల వ్యవహారాలలో అలుపెరగని కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎడ్లూరి రాధాకృష్ణ, వికాస కార్యదర్శి జవాజి శ్రీనివాసరావు, అధ్యాపకులు ప్రొఫెసర్ రత్నాకర్ ప్రొఫెసర్‌లు సుమంత్‌కుమార్, జగదీష్‌నాయక్, అధ్యాపకులు ఆచార్య పీవీ కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ నేలపాటి నాగేశ్వరావు, నూతక్కి వెంకటేశ్వర్లు, కావూరు శ్రీనివాసరావు, రమేష్, నంబూరు కోటేశ్వరావు, నంబూరి తాతయ్య, నంబూరు వెంకటేశ్వరరావు, వల్లభాపురం రాజకుమార్, నంబూరి రాజేంద్రప్రసాద్, విజయ్, నంబూరు సాంబయ్య, నంబూరి ఎజ్రా, అతిథి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంగంజాగర్లమూడి సర్పంచ్‌కు అవార్డు



ఢిల్లిలో జ్ఞాపికను అందుకుంటున్న సర్పంచ్ జయనాగలక్ష్మి

తెనాలి రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామ సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి అవార్డును అందుకున్నారు. రిపబ్లిక్ డే ను పురస్కరించుకుని ఢిల్లీలో జరిగిన వేడుకలకు ఆమెను ప్రధానమంత్రి కార్యాలయం నుండి ప్రత్యేకంగా ఆహ్వానించారు. గ్రామంలో శానిటేషన్, ఇతర మౌళిక వసతుల కల్పనకు ఆమె చేసిన కృషిని అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందించి అభినందించారు. ఢిల్లీలో ప్రశంశాపత్రాన్ని అందుకుని గ్రామానికి మంచి పేరుతెచ్చిన సర్పంచ్‌ని పలువురు గ్రామ పెద్దలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పసుపు రైతుల పరిహారం కోసం సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల స్టోరేజీలో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన పసుపు రైతులకు నష్టపరిహారం అందించాలని సబ్ కలెక్టర్ సంజన సింహాకు రైతు సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ, బీమా సంస్థ బీమా మంజూరు చేయడంలో తాత్సారం చేస్తోందని ఆరోపించారు. దేవదాయ భూముల పసుపు రైతులకు ఆర్‌సీ కార్డులు ఇవ్వకపోవడం వలన రుణాలు, సబ్సిడీలు అందడం లేదన్నారు. కొల్లిపర, గుడివాడ దళితవాడల్లో శ్మశాన స్థల సమస్యలను తీర్చాలని కోరారు. రహదారులను చక్కగా మరమ్మతులు చేయించాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ములకా శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేశాడంటూ భర్తపై ఫిర్యాదు

తెనాలి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దాడి చేశాడంటూ భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని కోపల్లె గ్రామానికి చెందిన రవి ఆటోనడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాగుడుకు బానిసై ఆటోను తాకట్టుపెట్టి ఇంటికి రావడంతో భార్య శ్రీదేవి భర్తను ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న రవి నాకే ఎదురు చెబుతావా అంటూ కోపంతో భార్యపై దాడి చేశాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్యాయత్నం

తెనాలి, మారీసుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం క్రాపకు చెందిన పట్టాభి అరుణ్ కుమార్ (29) నారాకోడూరుకు చెందిన వైశాలితో 4 నెలల క్రితం వివాహం జరిగింది. పుట్టింటికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన భార్య రోజులు గడుస్తున్నా కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 23న పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అరుణ్‌కుమార్ మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కేంద్ర మంత్రుల నుంచి అవార్డు అందుకుంటున్న గొడవర్రు సర్పంచ్ జానకి దేవి

సర్పంచ్ జానకి దేవికి జాతీయ ప్రభావశీల అవార్డు

చేబ్రోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామ సర్పంచ్ బీరం జానకిదేవి అత్యంత ప్రభావశీల సర్పంచి జాతీయ అవార్డును అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా 29 రాష్ట్రాల నుంచి 700 మంది సర్పంచులను కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి గొడవర్రు గ్రామ సర్పంచ్ జానకి దేవి ఒక్కరే ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 25వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, సహాయ మంత్రి ఎస్పీసింగ్ భగేల్ నుంచి జానకి దేవి ఈ అవార్డును అందుకున్నారు. గ్రామ పంచాయతీలో అభివృద్ధి, ప్రజలతో మమేకమవుతున్న తీరు గొడవర్రును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్న సందర్భంగా జానకి దేవి ఈ అవార్డును అందుకున్నారు. సర్పంచ్ జానకి దేవిని జిల్లా పంచాయతీరాజ్, స్థానిక అధికారులు, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

పది విద్యార్థులకు100 రోజుల యాక్షన్ ప్లాన్: డీవైఈవో

చేబ్రోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని తెనాలి ఉప విద్యాశాఖ అధికారిని జి.శాంతకుమారి అన్నారు. నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ను సోమవారం డీవైఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను ఆరా తీశారు. విద్యార్థులకు అందజేస్తున్న పౌష్టికాహారం, పరీక్షా సమయంలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని షేక్ నజ్మా, గైడ్ టీచర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు, ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు, ఏ శ్రీనివాసరావు, ఎండీ సల్మా కాతూన్ బి, కోటి పద్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్

నివేశన స్థలాలు మంజూరు చేయాలి: సీపీఐ

పొన్నూరు టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు కూటమి ప్రభుత్వం తక్షణమే నివేశన స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ములుకుదురులో సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జంగాల అజయ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామంలో మూడు సెంట్లు నివేశన స్థలాలు ఇస్తామని ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన వాగ్దానం అమలు చేయకుంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్ గౌస్, కాటూరి వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, త్రివేణి వెంకటేశ్వరమ్మ, నాగమ్మ, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.